విలేకరులు కావలెను

మనవార్త దినపత్రిక లో
పనిచేయుటకు విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను
Cell: 9247819181
8309605189



# మన వార్త

ప్రజాగళానికి అక్షర రూపం

MANA VAARTHA

EPAPER.MANAVAARTHA.NET

MANA VAARTHA

Telangana | సంపుటి: 1, సంచిక: 235 | volume::1, Issue:235 | బుధవారం 25 మార్చి 2026 | పేజీలు : 8 | వెల : 3.00


## టీబీ ముక్త భారత్ అభియాన్ ప్రారంభం



**ఖమ్మం:** ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా ఖమ్మం నగరంలోని బాలాజీ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో "టీబీ ముక్త భారత్ అభియాన్"లో భాగంగా జిల్లా వ్యాప్తంగా నిర్వహించే 100 రోజుల ప్రత్యేక టీబీ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా డ్రగ్స్ అసోసియేషన్ అందించిన న్యూట్రీషన్ కిట్లను మేయర్ పునుకొల్లు నీరజతో కలిసి కలెక్టర్ టిబి రోగులకు పంపిణీ చేశారు. టిబి వ్యాధిగ్రస్తులకు పోషకాహారం ఎంతో ముఖ్యమని, చికిత్సతో పాటు సరైన ఆహారం అందితే త్వరగా కోలుకునే అవకాశం ఉందని తెలిపారు. రోగులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో హైరిస్క్‌గా గుర్తించిన 94 గ్రామాల్లో 100 రోజులపాటు నిరంతరంగా టీబీ స్క్రీనింగ్ కార్యక్రమం చేపడతామని కలెక్టర్ వెల్లడించారు. అనుమానితులను గుర్తించి అవసరమైన పరీక్షలు నిర్వహించి వెంటనే చికిత్స ప్రారంభిస్తామని చెప్పారు. స్క్రీనింగ్ ప్రక్రియ మరింత సమర్థవంతంగా జరిగేలా వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖతో పాటు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, గ్రామ పంచాయతీలు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ సూచించారు. పోలియో నిర్మూలన తరహాలో టీబీ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో అవగాహన పెంచి టీబీ వ్యాధిని పూర్తిగా నిర్మూలించే దిశగా సమన్వయంతో పని చేయాలని అన్నారు. టీబీ నియంత్రణలో ఖమ్మం జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపిన వైద్యారోగ్య శాఖ సిబ్బందిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాను టీబీ రహితంగా మార్చడం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ప్రజలు కూడా లక్షణాలు కనిపిస్తే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని, చికిత్స తీసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు

## ఈవీ పాలసీతో కాలుష్య నియంత్రణ



**హైదరాబాద్:** రాష్ట్రంలో కాలుష్యాన్ని తగ్గించి హైదరాబాద్ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈవీ పాలసీని అమలు చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకొచ్చిన ఈ విధానం ద్వారా పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈవీ పాలసీ కింద ఎలక్ట్రిక్ వాహనాలకు జీరో రోడ్ టాక్స్, జీరో రిజిస్ట్రేషన్ టాక్స్ మినహాయింపులు కల్పించినట్లు తెలిపారు. దీనివల్ల ప్రభుత్వానికి దాదాపు వెయ్యి కోట్ల ఆదాయ నష్టం వచ్చినప్పటికీ, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఈ విధానాన్ని ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. పాలసీ అమలులోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం గణనీయంగా పెరిగిందని వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగించేలా ప్రోత్సాహం కల్పించాలని తయారీ సంస్థలను కోరినట్లు తెలిపారు. ప్రభుత్వ విభాగాలు, సంస్థలు వాహనాలు కొనుగోలు చేసే సమయంలో ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఈవీ చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసి, వాహన వినియోగానికి అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ప్రముఖ కంపెనీలు కూడా ముందుకు వచ్చి ప్రభుత్వ ఉద్యోగులకు 10 నుంచి 20 శాతం వరకు డిస్కౌంట్లు అందిస్తున్నాయని తెలిపారు. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయని, డీజిల్ ఆటోలను కూడా రీట్రోఫిట్ చేసి ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చే ప్రణాళికలు ఉన్నాయని చెప్పారు. 15 సంవత్సరాలు దాటిన వాహనాలను స్క్రాపేజీకి పంపిస్తూ కాలుష్యాన్ని తగ్గించే చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇక వాహనాల కొనుగోలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేసేందుకు వాహన్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. వాహనాన్ని కొనుగోలు చేసిన షోరూమ్‌లోనే రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకునే అవకాశం కల్పించామని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి చేరాలంటే ఉద్యోగులే కీలక పాత్ర పోషిస్తారని మంత్రి స్పష్టం చేశారు.

## సీట్ బెల్ట్ తప్పనిసరి...




**హైదరాబాద్:** రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు తెలంగాణ పోలీసులు సీట్ బెల్ట్ వినియోగంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. వాహనాల్లో ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని సూచిస్తున్నారు. చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాపాయానికి దారి తీస్తుందని హెచ్చరిస్తున్నారు. ప్రత్యేకంగా ముందు సీటులో కూర్చున్న వారు మాత్రమే కాకుండా, వెనుక సీట్లలో ప్రయాణించే వారు కూడా సీట్ బెల్ట్ ధరించడం అవసరమని పోలీసులు స్పష్టం చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో సీట్ బెల్ట్ ప్రాణాలను కాపాడే ముఖ్యమైన భద్రతా పరికరమని పేర్కొన్నారు. సీట్ బెల్ట్ ధరించకుండా ప్రయాణించడం వల్ల ప్రమాద సమయంలో తీవ్ర గాయాలు లేదా ప్రాణ నష్టం సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిస్తున్నారు. మొత్తానికి, సీట్ బెల్ట్ వినియోగం ఒక చిన్న అలవాటు అయినప్పటికీ, అది ప్రాణాలను కాపాడే పెద్ద రక్షణగా నిలుస్తుందని పోలీసులు పేర్కొన్నారు. రోడ్డు భద్రత కోసం ప్రతి ఒక్కరూ ఈ నియమాన్ని తప్పనిసరిగా పాటించాలని సూచిస్తున్నారు.

## ఆదిలాబాద్ జిల్లాలో టీబీ ముక్త భారత్ అభియాన్ ప్రారంభం



- **జ్యోతి ప్రజ్వలనతో 100 రోజుల ప్రత్యేక ప్రచారం...**
- **రోగులకు నిక్షయ్ మిత్ర కిట్ల పంపిణీ..**
- **అవగాహన వాహనానికి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభం..**

**ఆదిలాబాద్:** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలోని భీంపూర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని "టీబీ ముక్త భారత్ అభియాన్" 100 రోజుల ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనకు ఈ కార్యక్రమం ముఖ్యమైనదిగా అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా టిబి వ్యాధిగ్రస్థులకు కళావతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిక్షయ్ మిత్ర కిట్లను కలెక్టర్ పంపిణీ చేశారు. అలాగే టిబి నియంత్రణలో విశేషంగా పనిచేసిన సర్పంచ్‌లకు, ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు ప్రశంస పత్రాలు అందజేశారు. ఆరోగ్య రంగంలో పనిచేస్తున్న వారికి ఇది ప్రోత్సాహకరంగా ఉంటుందని తెలిపారు. అనంతరం టిబి నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించే ప్రచార వాహనాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాహనం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, చికిత్స విధానాలపై విస్తృత ప్రచారం చేపట్టనున్నారు. ముందుగానే గుర్తించి చికిత్స పొందితే క్షయ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు వైద్యాధికారులు సాధన, మనోహర్, టిబి ప్రోగ్రామ్ అధికారి సుమలత, తహసిల్దార్ రమేష్, ఎంపీడీవో గోపాల కృష్ణ రెడ్డి, కళావతి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అశోక్, వైద్యులు, రోగులు, సర్పంచ్లు రంజన, లక్ష్మీ, కోమల్, లత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రజల సహకారం అవసరమని అధికారులు పిలుపునిచ్చారు.

## గ్యాస్ సంక్షోభంపై అసెంబ్లీ ముట్టడి...




**హైదరాబాద్:** రాష్ట్రంలో నెలకొన్న గ్యాస్ కొరత సమస్యపై బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్ పార్క్ వద్ద గ్యాస్ సిలిండర్ల ప్లకార్డులతో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, గ్యాస్ సంక్షోభంపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన అనంతరం బీఆర్ఎస్ నాయకులు అసెంబ్లీ వైపు ర్యాలీగా బయలుదేరారు. ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేస్తూ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరా విషయంలో పారదర్శకత లేకపోవడం వల్ల ప్రజల్లో గందరగోళం నెలకొన్నదని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రభుత్వం వాస్తవ పరిస్థితులను దాచిపెడుతోందని ఆరోపించారు. కేటీఆర్ మాట్లాడుతూ, ఒకవైపు గ్యాస్ కొరత లేదని ప్రభుత్వం చెబుతుంటే, మరోవైపు హోటళ్లు, చిరు వ్యాపారులకు సరఫరాను నిలిపివేయడం తీవ్ర అన్యాయం అని అన్నారు. గ్యాస్ అందక హోటల్ వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని, వేలాది కుటుంబాలు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం ఆందోళనకరమని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా గ్యాస్ కొరత ప్రభావం సాధారణ ప్రజలపై కూడా పడుతోందని కేటీఆర్ తెలిపారు. గృహ వినియోగదారులు కూడా సిలిండర్లు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ధరలు పెరగడం, సరఫరా ఆలస్యం వంటి సమస్యలు ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్యాస్ సరఫరా అంశంపై ప్రజలకు నిజాలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సరఫరా వ్యవస్థలో ఉన్న లోపాలను గుర్తించి, వాటిని సరిదిద్దేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గ్యాస్ అందుబాటును పెంచాలని ఆయన అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గ్యాస్ సంక్షోభంపై స్పందించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కేటీఆర్ స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరాను పెంచేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని, వ్యాపారులు, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని కోరారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

## వనపర్తి పర్యటనలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి ఘన స్వాగతం



**వనపర్తి:** వనపర్తి జిల్లా పర్యటనలో భాగంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావుకు అజాకొల్లు మార్గమధ్యంలో ఘన స్వాగతం లభించింది. బీజేపీ వనపర్తి జిల్లా అధ్యక్షుడు మరియు మదనాపురం మండల కార్యకర్తలు కలిసి ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మద్దతును తెలియజేశారు. కార్యకర్తల ఉత్సాహం, పార్టీ పట్ల వారి అంకితభావం స్పష్టంగా కనిపించిందని నేతలు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న ప్రతి కార్యకర్త పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. గ్రామస్థాయిలో పార్టీని బలపరిచే దిశగా కార్యకర్తలు చేస్తున్న కృషిని నాయకత్వం ప్రశంసించింది. తెలంగాణలో బీజేపీ విస్తరణకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని నేతలు పిలుపునిచ్చారు. ప్రజలకు చేరువగా ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలే ప్రధాన బలం అని తెలిపారు. ఈ సందర్భంగా కార్యకర్తలందరికీ నాయకత్వం హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసింది. భవిష్యత్తులో మరింత సమన్వయంతో పనిచేస్తూ పార్టీని బలోపేతం చేయాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమం మొత్తం ఉత్సాహభరితంగా సాగి, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

## ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు



**శంకరపట్నం:మార్చి 24(మనవార్త ప్రతినిధి)**శంకరపట్నం మండలం కేశవపట్నం రైతు వేదికలో మంగళవారం ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా రైతులకు భూగర్భ జలాల సంరక్షణ,సాగునీటి వనరులు,తదితర విషయాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని జిల్లా భూగర్భ జల అధికారి శ్యాంప్రసాద్ నాయక్ నేతృత్వంలో ఆదరణ సేవా సమితి స్వచ్ఛంద సంస్థ సహకారంతో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారిని జే. భాగ్యలక్ష్మి హాజరై మాట్లాడారు..జల సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుని కర్తవ్యం అని తెలిపారు.నీటిని వృధా చేయకుండా ఆదా చేయడం ద్వారా భవిష్యత్తు తరాలకు సురక్షితమైన జీవనాన్ని అందించగలమని సూచించారు.అనంతరం జల సంరక్షణ గురించి నీటి ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో ఏవో వెంకటేష్,ఆదరణ సేవా సమితి అధ్యక్షురాలు కర్రె పావని,భూగర్భ జల శాఖ సహాయ హైడ్రోజియాలజిస్ట్ ఉమాదేవి,సహాయ హైడ్రాలజిస్ట్ అభిలాష్,సహాయ కెమిస్ట్ అఖిల,మధుసూదన్,సూపరిండెంట్ రెహమాన్, కేశవపట్నం సర్పంచ్ రాజేంద్రప్రసాద్,కరీంపేట సర్పంచ్ శ్రీలత,గొల్లపల్లి సర్పంచ్ విద్యాసాగర్ రావు,ఏఈఓ లు రైతులు పాల్గొన్నారు.

## ఈనెల 28న నేషనల్ లోక్ అదాలత్...




**-రాజీ మార్గమే రాజమార్గం:ఎస్సై శేఖర్ రెడ్డి....**

**శంకరపట్నం:మార్చి24(మనవార్త ప్రతినిధి)**శంకరపట్నం మండల ప్రజలు తమ పెండింగ్ కేసులను పరిష్కరించుకునేందుకు ఈనెల 28న హుజురాబాద్ కోర్టులో నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు కేశవపట్నం ఎస్సై కట్కూరి శేఖర్ రెడ్డి తెలిపారు.కోర్టులో పెండింగ్ లో ఉన్న రాజీ పడదగిన కేసులను పరస్పర అవగాహనతో పరిష్కరించుకునేందుకు ఇదే మంచి అవకాశమని ఆయన పేర్కొన్నారు.క్రిమినల్ కేసులు,ట్రాఫిక్ కేసులు,చిన్నపాటి వివాదాలు,ఎక్సైజ్ కేసులు,కుటుంబ విభేదాలు,ఆస్తి తగాదాలు వంటి అంశాల్లో రాజీకి సాధ్యమయ్యే కేసులను లోక్ అదాలత్ లో పరిష్కరించుకోవచ్చన్నారు.తద్వారా ఖర్చులు తగ్గడంతో పాటు సమయం కూడా ఆదా అవుతుందని వివరించారు.దీంతో ఇరుపక్షాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు.కావున మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ శేఖర్ రెడ్డి కోరారు.

## రైతులు పామ్ ఆయిల్ తోటలను సాగుచేసి ఆర్థికంగా ఎదగాలి

**-పర్సన్ ఇంచార్జి మహమ్మద్ షఫీయోద్దిన్ ఇలా అన్నారు...**

**ఎల్లారెడ్డిపేట మార్చి 24: (మనవార్త ప్రతినిధి)** రైతులు ఫామ్ ఆయిల్ తోటలను సాగుచేసి ఆర్థికంగా ఎదగాలి యూరియా 20 20 28 డిఎపి రైతులకు సకాలంలో అందజేయాలి వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలను సకాలంలో ఏర్పాటు చేయాలి రైతులు పామ్ ఆయిల్ తోటలను సాగుచేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఎల్లారెడ్డిపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పర్సన్ ఇంచార్జి మహమ్మద్ షఫీయోద్దిన్ అన్నారు, ఎల్లారెడ్డిపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సమావేశ మందిరంలో మహాసభ ఫసియుద్దీన్ అధ్యక్షతన మంగళవారం జరిగింది, ఈ సందర్భంగా పసియుద్దీన్ మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా నిర్మేట లో ఆయిల్ ఫ్యాక్టరీ ని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ప్రారంభించారని అందుబాటులో ఫ్యాక్టరీ ఉన్నందున ఈ ప్రాంత రైతులు పంట మార్పిడి చేసుకుని పామ్ ఆయిల్ తోటలను పెంచుకొని ఆర్థికంగా ఎదగాలని ఆయన సూచించారు 2025, 2026 సంవత్సర వార్షిక నివేదికను తేదీ 16 9 2025 నుండి, తేదీ 08 -03 -2026 వరకు జరుపబడిన ఆదాయ వ్యయాల పట్టిక 2026,27 సంవత్సరమునకు అంచనా బడ్జెట్ ను సభలో సభ్యులకు చదివి వినిపించారు , పంట రుణములు ట్రాక్టర్లు గొర్రెలు పాడి పశువులు కర్షక మిత్ర రుణములు స్వల్పకాలిక రుణాల కింద 12 కోట్ల 90 లక్షల 33 వేల 990 రూపాయలు, దీర్ఘకాలిక రుణాలు 13 కోట్ల 31,75,891 రూపాయలు రైతులకు అందించడం జరిగిందన్నారు, 33 మంది వాయిదా మీరిన దీర్ఘకాలిక అప్పులు 39 లక్షల 55,441 రూపాయలు వసూలు చేయాలని సిబ్బందిని మహాసభలో సభ్యులు కోరారు, యూరియా తోపాటు 20,20,28 డిఏపి రైతులకు సకాలంలో అందజేయాలని సభలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి సర్పంచుల పోరం మండలం అధ్యక్షులు దోమ్మాటి నరసయ్య నాయకులు బండారి బాల్రెడ్డి లు ప్రసంగిస్తూ సహకార సంఘం అధికారులకు విజ్ఞప్తి చేశారు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు ఇబ్బంది లేకుండా నిర్వహించాలని వారు కోరారు, మహాసభలో ఏఎంసి వైస్ చైర్మన్ గుండాడి రామ్ రెడ్డి డైరెక్టర్ మెండే శ్రీనివాస్ యాదవ్ రైతులు నంది కిషన్, మద్దుల శ్రీపాల్ రెడ్డి, లక్ష్మణ్ పాత తులసి ఎరుపుల హానుమయ్య మేగి నర్సయ్య, దీటీ నర్సయ్య ,అంజిరెడ్డి, శంకర్ , బురుక శ్రీనివాస్ ప్రాథమిక సహకార సంఘం సిబ్బంది వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు ,




## రెడ్డి సంఘం మండల అధ్యక్షుడికి ఘనంగా సన్మానం



**ఎల్లారెడ్డిపేట మార్చి 24:( మన వార్తా ప్రతినిధి)**ఎల్లారెడ్డిపేట మండల రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు కుంభాల సుధాకర్ రెడ్డి ని ఎల్లారెడ్డిపేట మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్ రెడ్డి ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమం లో రెడ్డి సంఘం మండల మాజీ అధ్యక్షులు గన్న మల్లారెడ్డి, నేవూరి వెంకట నర్సింహా రెడ్డి, బంధారాపు లక్ష్మారెడ్డి లు ఉన్నారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ జమదగ్ని కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



**ఎల్లారెడ్డిపేట మార్చి 24: (మన వార్తా ప్రతినిధి)**ఎల్లారెడ్డిపేట మండలం బొప్పపూర్ లొ గౌడ సంఘం వారు నిర్వహిస్తున్న సిద్ధోగం,రేణుక ఎల్లమ్మ జమదగ్ని కళ్యాణ మహోత్సవంలో పాల్గోని అమ్మవారిని దర్శించుకున్న రాజన్న సిరిసిల్ల జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తోట ఆగన్న ,జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు చిదుగు గోవర్ధన్ గౌడ్, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణ హరి,బిఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్, సతీష్, తదితరులు కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపిన గౌడ సంఘం సభ్యులు.

## మృతురాలి కుటుంబానికి ఆపన్నహస్తం...



**ఇల్లంతకుంట,మార్చి 24 (మన వార్త ప్రతినిధి);**ఇల్లంతకుంట మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన చల్లూరి బాలవ్వ కుటుంబ సభ్యులను మండల గౌడ సంఘం ప్రతినిధులు మంగళవారం పరామర్శించారు.ఈ సందర్భంగా జవరిపేటకు చెందిన ముత్యం బాలాగౌడ్ ఆధ్వర్యంలో మృతురాలి కుటుంబ సభ్యుడు చల్లూరి భానుగౌడ్‌కు రూ.5 వేల నగదు సాయం అందజేశారు.బాలవ్వ మృతి బాధాకరమని పేర్కొన్న వారు,కుటుంబానికి ఇది తీరని లోటని తెలిపారు.మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజశేఖర్ గౌడ్, సాయిగౌడ్, భాస్కర్ గౌడ్, రాజయ్య గౌడ్, దేవేందర్ గౌడ్, ముంజ భాస్కర్ గౌడ్, అనిల్ గౌడ్, అంజయ్య గౌడ్, ప్రదీప్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, సాయి గౌడ్, ముత్యం రాజు తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ వద్ద సర్పంచ్ అరెస్టు..

**-పాస్ ఉన్నా పట్టించుకోలేదని మల్లేశం ఆవేదన...**

**ఇల్లంతకుంట,మార్చి 24 (మన వార్త ప్రతినిధి);**రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని రేపాక గ్రామ సర్పంచ్ కాత మల్లేశంను మంగళవారం హైదరాబాద్ అసెంబ్లీ ప్రాంగణం వద్ద పోలీసులు అరెస్ట్ చేయడం చర్చనీయాంశమైంది.తాను అధికార పార్టీ కాంగ్రెస్‌కు చెందిన సర్పంచ్‌నని,మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సిఫారసుతో అసెంబ్లీ సమావేశాలను వీక్షించేందుకు పాస్ తీసుకుని వచ్చినప్పటికీ పోలీసులు పట్టించుకోలేదని మల్లేశం ఆవేదన వ్యక్తం చేశారు.తనను ప్రతిపక్ష నేతగా భావించి అరెస్ట్ చేయడం సరికాదని పేర్కొన్నారు.పాస్ ఉన్నప్పటికీ పరిశీలించకుండా ఇలా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు.పాస్ చూపించినా తన మాట వినకుండా అరెస్ట్ చేయడం అన్యాయమని తెలిపారు.ఈ సందర్భంగా "మీరేం పోలీసులు అన్న" అంటూ ఆవేదన వ్యక్తం చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.ఈ ఘటనపై మానకొండూర్ నియోజకవర్గంలో చర్చ కొనసాగుతోంది.



## అక్రమ అరెస్టులతో ఉద్యమం ఆగదు..

**-బీఆర్ఎస్ యువజన నేతల అరెస్టులపై తీవ్ర విమర్శలు...**

**ఇల్లంతకుంట,మార్చి 24 (మన వార్త ప్రతినిధి):**ఫీజు బకాయిల విడుదల కోసం బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహించిన చలో అసెంబ్లీ కార్యక్రమం నేపథ్యంలో ఇల్లంతకుంట పోలీసులు బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు బుర్ర సూర్య గౌడ్,మాజీ ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఎండి సాదుల్,మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎంద్ర చందన్,యువజన నాయకుడు దయ్యాల మహేష్‌లను అరెస్టు చేయడం వివాదాస్పదమైంది.ఈ సందర్భంగా వారు అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండించారు.నిరసనలు తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని ప్రభుత్వం ప్రకటించినా,ఆచరణలో మాత్రం కనిపించడం లేదని విమర్శించారు.ఇలాంటి చర్యలతో ప్రజా వ్యతిరేకత నుంచి ప్రభుత్వం తప్పించుకోలేదని,హెచ్చరికలు జారీ చేశారు.అక్రమ అరెస్టులతో ఉద్యమాలను అణిచివేయలేమని స్పష్టం చేస్తూ,ప్రభుత్వం వెంటనే విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేసి,ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.




## ఉప్పల వెంకటేష్ సేవా తత్వాన్ని సహించలేని ప్రత్యర్థి పార్టీ నాయకులా




**కల్వకుర్తి.మార్చ్.24. మన వార్త ప్రతినిధి** అంబలి కేంద్రంలో ఉప్పల వెంకటేష్ ఫోటో తొలగించాలని ఆదేశించింది ఎవరు కల్వకుర్తి పట్టణంలోని బస్టాండ్ ప్రాంగణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఏర్పాటు చేసిన అంబలి,చలివేంద్రం కేంద్రానికి అధిక మొత్తంలోప్రజాఆదరణరావడంతోసేవాభావాన్ని కూడా రాజకీయ రణరంగంగామార్చడానికిఅధికారులుప్రయత్నిస్తున్నారని ఆర్యవైశ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ అంబలి, చలివేంద్ర కేంద్రంలో ఏర్పాటుచేసిన దాత చిత్రపటాన్ని తొలగించాలని ఓ అధికారి అదే కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్యవైశ్య వర్గానికి చెందిన ఉద్యోగితోఒత్తిడి చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న ఆర్యవైశ్యులు కార్యాలయ అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.మానవత్వం మరిచి సేవా తత్వాన్ని కూడా రాజకీయ కోణంలో చూస్తూ రాజకీయ రణరంగ మారుస్తున్నారని ఈ విషయాన్ని విన్న పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు వివిధరూపేనాప్రభుత్వానికిచెల్లిస్తున్న పన్నులతో ఇచ్చే పథకాలకే వారిసొంతసొమ్ముఖర్చుపెట్టినట్టుగా వారి చిత్రపటాలను పెట్టుకుంటున్నారని,సొంతంగా జేబులోనుండి ఖర్చులు భరిస్తూ సేవా కార్యక్రమం చేస్తుంటే ఓర్వలేకపోతున్నారా అని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.గతంలో సత్యసాయి సేవా మందిరం వారుసత్యసాయిచిత్రపటాన్నిపెట్టిచలివేంద్రంలో త్రాగు నీటినిమాత్రమేఅందించేవారుఅప్పట్లో ఆయన చిత్రపటాన్ని పెట్టిసేవచేసేవారు.అధికారులు గతంలో ఎప్పుడు ఈ విధంగా వ్యవహరించలేదని, ప్రస్తుత అధికారుల వ్యవహార శైలిపై పలు అనుమానాలను వ్యక్తం చేస్తు సేవా తత్వాన్ని రాజకీయ రణరంగంగా మార్చకూడదని, వివిధ పార్టీ నాయకులను ఆర్యవైశ్యులు వేడుకుంటున్నారు.

## ప్రభుత్వ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్



**కల్వకుర్తి. మార్చి 24. మన వార్తా ప్రతినిధి.**వెల్దండ మండల ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ అమలు చేస్తున్న "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ఆరోగ్య మిషన్" కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న స్పెషలిస్ట్ వైద్య శిబిరాలను ప్రజలు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. కె. రవికుమార్, వెల్దండ గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ పేర్కొన్నారు. మంగళవారంవెల్దండ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని వెల్దండ గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ క్యాంపు ప్రారంభించారు.ఈ సందర్భంగా శిబిరంలో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, రోగులతో నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులనుతెలుసుకున్నారు.జిల్లా ఆసుపత్రి నుంచి వచ్చిన స్త్రీరోగ నిపుణులు, శిశు వైద్యులు, ఎముకల వైద్యులు, కంటి వైద్యులు, దంత వైద్యులు మరియు జనరల్ ఫిజీషియన్లు పాల్గొని వివిధ రకాల ఆరోగ్య సమస్యలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి,అవసరమైన చికిత్స మరియు మందులను అందించారు. దీని ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు వారి గ్రామాల వద్దేఅందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. ప్రపంచ క్షయవ్యాధి (TB) నియంత్రణ దినోత్సవం సందర్భంగా ప్రారంభించిన 100 రోజుల ప్రత్యేక కార్యక్రమం రెండో దశలో భాగంగా, 14 సంవత్సరాల పైబడిన ప్రతి ఒక్కరికీ TB స్క్రీనింగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. టిబి లక్షణాలు ఉన్నవారు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరీక్షలు చేయించుకోవాలని, సమయానికి చికిత్స తీసుకుంటే టిబి పూర్తిగా నయం అవుతుందని వివరించారు.ప్రజల్లో టిబి పై అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని, టిబి వ్యాధి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజం మొత్తం కలిసి పనిచేస్తేనే టిబినిపూర్తిగానిర్మూలించగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలోడిప్యూటీడీ.ఎం.హెచ్.ఓ.డా.భీమానాయక్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపర్ స్పెషాలిటీ వైద్య బృందం డా. సమీరా , డా. ప్రమోద్, డా. సాయి తేజ, డా. లత, , డా. స్ఫూర్తి, డా. ఖదీర్ స్థానిక వైద్యాధికారి డా.సింధు, పర్యవేక్షణ అధికారులు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ జమదగ్నిల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు



**ఎల్లారెడ్డిపేట మార్చి :24 (మన వార్తా ప్రతినిధి)**రాజన్న సిరిసిల్ల జిల్లా: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలో మంగళవారం రోజున శ్రీ రేణుక ఎల్లమ్మ జమదగ్నిల కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది ఈ కళ్యాణ మహోత్సవానికి రాచర్ల బొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సబేర బేగం-గౌస్, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, వైస్ చైర్మన్ గుండాడి రామిరెడ్డి, డైరెక్టర్ మేండే శ్రీనివాస్ యాదవ్, మండల ఉపాధ్యక్షులు గండికోట రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గౌడ సంఘ సభ్యులు ఇట్టి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు

## జాలిగామలో వైభవంగా శ్రీ సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు



**గజ్వేల్ మార్చి 24 మన వార్త ప్రతినిధ** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం జాలిగామ గ్రామంలో శ్రీ సీతారామ లక్ష్మణ భక్తాంజనేయ, గణపతి, నందీశ్వర, రామలింగేశ్వర స్వామి మరియు నవగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరుగుతున్నాయి. శ్రీ సీతారామ ఆలయ కమిటీ, భక్త బృందం మరియు గ్రామ ప్రజల ఆధ్వర్యంలో మార్చి 23 నుండి 25 వరకు ఈ ప్రతిష్టా కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం (మార్చి 24) ఉదయం 9 గంటల నుండి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. అర్చకులు మరియు ఆలయ కమిటీ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం ఆవాహిత దేవత పూజ, జానాది వాసం, ఆవాహిత దేవత హవనం, మూలమంత్ర హవనం నిర్వహించారు. మధ్యాహ్నం 1 గంటకు స్వామివార్లకు మహాభిషేకం, చతుర్వద బలి కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం 4 గంటల నుండి శయ్యాధి వాసం, పుష్ప ఫలాది వాసాలు, అధివాస హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. అనంతరం మంగళహారతి, మంత్రపుష్పం సమర్పించి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేయనున్నారు. ఈ వేడుకల్లో ప్రధాన ఘట్టమైన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణోత్సవం.

## అవును "మనం "టీ బి ని "అంతం చేయగలం...




**మధిర మార్చి 24( మన వార్త):**మధిర మండలపీహెచ్ సీ దెందుకూరు వైద్య లు డాక్టర్ బి సాయి పృథ్వి రాజ్ నాయక్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అది కారి డాక్టర్ డి రామా రావు, అడిషనల్ డి ఎమ్ &హెచ్ ఓ డాక్టర్ చంద్ నాయక్, డిప్యూటీ డి ఎమ్ &హెచ్ ఓ డాక్టర్ వేణు మాధవ్ రావు, జిల్లా క్షయ నివారణ అధికారి మరియు క్షయ నివారణ అవగాహన లో జాతీయ ఆవార్డు పొందిన డాక్టర్ వరికూటి సుబ్బారావు ఆదేశాలు మేరకు జిల్లా వేప్తా ము గా ప్రపంచం ట్యూబర్ క్యూలో సీస్ (క్షయ నివారణ )దినం లో భాగంగా పీహెచ్ సీ దెందుకు రు లో వైద్య లు పారా మెడికల్ సిబ్బంది సమూయుక్తము గా టీబీ గురించి ప్రజా అవగాహన ర్యాలీ చేపట్టిన రు ఈ సందర్బంగా డాక్టర్ పృథ్వి, మరియు కమ్యూనిటీ హెల్త్ ఆఫీస్ ర్ వి వెంకటేశ్వర్లు మాట్లాడు తు మనం అందు కలిసి టీబీ జబ్బు నూ అంతం చేయాలి అని జబ్బు గురించి సంపూర్ణ ము గా వివరించి కర పత్రాలు పంచి పెట్టినారు అదే విధంగా పీహెచ్ సీ కీ వచ్చిన గర్భిణీ లు బాలింతలు కు వయో వృద్ధులు కు టీబీ జబ్బు లక్షణాలు మరియు అత్యంత ఖరీదు ఐన టీబీ మందులు తెలంగాణ ప్రభుత్వం కేంద్రం ప్రభుత్వం ద్వారా ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ ప్రోగ్రాం లో భాగంగా గ్రామీణ పట్టణ ప్రాంతలుకు ఆరోగ్య సిబ్బంది ద్వారా ఉచిత ము గా అందిస్తున్న ధీ అని వారు వివరించి నారు అదే విధంగా మడు పల్లి బస్తిదవా ఖానా సిబ్బంది హైస్కూల్ పిల్లలు తో ప్రపంచం క్షయ నివారణ దినం ర్యాలీ నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం లో డాక్టర్ దివ్య శృతి డాక్టర్ సుస్మా cho వి వెంకటేశ్వర్లు, గోవింద్ మడు పల్లి హైస్కూల్ ఇంచార్జి హెడ్ మాస్టర్ తోట నర్సింహా రావు మధిర టీబీ యూనిట్ సిబ్బంది మరియు వివిధపారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు

## గజ్వేల్ లో శ్రీ వాసవి చలివేంద్రం ప్రారంభం...

**–ఆర్యవైశ్యులు సేవకు ప్రతిరూపం ట్రాఫిక్ సిఐ మురళి...**

**గజ్వేల్ మార్చ్ 24 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఇందిరా పార్క్ చౌరస్తా వద్ద ఆర్యవైశ్య నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'శ్రీ వాసవి మాత చలివేంద్రాన్ని' గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలంలో భానుడి భగభగలకు తట్టుకోలేక ఇబ్బంది పడే బాటసారులు, వాహనదారులు, సామాన్య ప్రజల దాహార్తిని తీర్చడానికి ఇలాంటి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం ఎంతో గొప్ప విషయమని, ఆర్యవైశ్య సంఘం ఎప్పుడూ సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటుందని, కేవలం మంచినీరే కాకుండా అంబలి, మజ్జిగ పంపిణీ చేయడం వారి సేవా నిరతికి నిదర్శనం అన్నారు. పేర్కొన్నారు. ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళల్లో బయటకు రాకూడదని సూచించారు. ప్రయాణికులు ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ చలివేంద్రం ఏర్పాటుకు కృషి చేసిన ఆర్యవైశ్య సంఘం నాయకులను, ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్.సి. రాజమౌళి, పిసిసి రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుంటుకు శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు డాక్టర్ ఎలిశాల లింగం, సిద్ది బిక్షపతి, నంగునూరి సత్యనారాయణ,శివకుమార్, తోట బిక్షపతి, సిద్దిపేట శ్రీనివాస్, రుక్మయ్య, ఎర్రం శ్రీనివాస్, ఎన్.సీ. శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రవికంటి చంద్రశేఖర్, ఉప్పల కృష్ణమూర్తి,రమేష్, గందె సంతోష్, నేతి సంతోష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## చిలుకవాగు ప్రక్షాళనకై మంత్రి సీతక్కకి విజ్ఞప్తి చేసిన సర్పంచ్ జీవన్ రెడ్డి



**కొడిమ్యాల: మార్చ్ 24మన వార్త ప్రతినిధి** కొడిమ్యాల పట్టణ కేంద్రంలో ప్రధాన సమస్య అయిన చిలుకవాగు ప్రక్షాళన కోసం అవసరం అయిన 4 కోట్ల నిధులు, మోడల్ బస్ స్టాండ్ నిర్మాణంకోసం 2 కోట్ల నిధుల మంజూరీ నిమిత్తం అసెంబ్లీలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రివర్యులు ధనసరి అనసూయ(సీతక్క) గారిని మరియు రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గారిని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గారితో కలసి వినతిపత్రం అందించిన సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి. ఈ సందర్బంగా గ్రామ అబివురుద్ది కోసం మంత్రులు నిధుల కేటాయింపుపైన స్పష్టమైన హామీ ఇచ్చినట్టు తెలిపారు.

## డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

**–3K రన్ పోస్టర్‌ను ఆవిష్కరించిన పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్...**

**గజ్వేల్, మార్చి 24 మన వార్త ప్రతినిధి** యువత డ్రగ్స్ వంటి దురలవాట్లకు దూరంగా ఉండి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తూ ఇన్‌స్పైర్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఫౌండేషన్ మూడవ వార్షికోత్సవం సందర్భంగా ఏప్రిల్ 19వ తేదీన నిర్వహించబోయే 'యాంటీ డ్రగ్స్ 3K రన్' పోస్టర్‌ను సిద్దిపేట పోలీస్ కమిషనర్ మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారిని రూపుమాపడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఏప్రిల్ 19న జరిగే ఈ 3K రన్‌లో యువత, విద్యార్థులు మరియు నగర ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇన్‌స్పైర్ గ్లోబల్ ఫౌండేషన్ 3వ వార్షికోత్సవం. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఇన్‌స్పైర్ గ్లోబల్ ఫౌండేషన్ ఫౌండర్ మరియు ప్రెసిడెంట్ పి. గోపాల్, వైస్ ప్రెసిడెంట్ కేతోజి వినోద్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సుధాకర్, సభ్యులు నల్ల నవీన్ మరియు ఇతర ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పించడమే ఈ రన్ యొక్క ముఖ్య ఉద్దేశమని తెలియజేశారు.






## మచ్చ బొల్లారంలో మురుగు మయమైన రోడ్లు...

**–ఫిర్యాదులు విన్నా స్పందించని అధికారులు!"**

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మార్చ్ 24 మన వార్త :** అల్వాల్ సర్కిల్ మచ్చ బొల్లారం డివిజన్ పరిధిలోని రుక్మిణి విల్లాస్ కాలనీ, రైల్వే ట్రాక్ రోడ్ ప్రాంతంలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా మారింది. మురుగు నీరు పొంగిపొర్లుతూ రోడ్డు మొత్తం నింపేయడంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది తాత్కాలిక సమస్య కాదని, పూర్తిస్థాయి పరిష్కారం అవసరమని వారు డిమాండ్ చేస్తున్నారు. కానీ అధికారుల నుంచి మాత్రం ఎటువంటి స్పష్టమైన చర్యలు కనిపించడం లేదు. మురుగు నీరు రోడ్లపై నిల్వ ఉండడం వల్ల దోమలు పెరిగే అవకాశం ఉంది. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత విభాగాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. స్థానికుల మాటల్లోనే చెప్పాలంటే "పన్నులు కట్టేది మేమేడ కానీ సౌకర్యాలు మాత్రం రావడం లేదు." కాలనీ ప్రజలు తమ సమస్యలను పదేపదే తెలియజేసినా, అధికారులు స్పందించకపోవడం వల్ల వారు తీవ్ర నిరాశలో ఉన్నారు. వెంటనే డ్రైనేజీ లైన్ శుభ్రపరచాలి మురుగు నీటి నిల్వ తొలగించాలి శాశ్వత పరిష్కారం కోసం డ్రైనేజీ వ్యవస్థను పునర్నిర్మించాలి నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి మచ్చ బొల్లారం డ్రైనేజీ సమస్య కేవలం ఒక కాలనీ సమస్య కాదుడ ఇది పట్టణ నిర్వహణలో ఉన్న లోపాలను బహిర్గతం చేస్తోంది. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా స్పందించని వ్యవస్థపై ఇప్పుడు ప్రశ్నలు మిన్నంటుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు కళ్లుతెరుస్తారా? లేక మురుగు నీటిలోనే ప్రజలు మగ్గాల్సి వస్తుందా వేది చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.




## డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

**– గజ్వేల్ ప్రోమో రన్ ను జయప్రదం చేయాలి ...**
**– పోలీసులం భాగస్వామ్యులం అవుతాం ...**
**– సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మి పెరుమాళ్ ...**




**గజ్వేల్ మార్చ్ 24 మన వార్త ప్రతినిధి** యువతీ, యువకులు డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రెష్మీ పెరుమాళ్ పిలుపునిచ్చారు. గజ్వేల్ రన్నర్స్ అసోసియేషన్ లోగోను, గజ్వేల్ ప్రోమో రన్ వాల్ పోస్టర్ ను సిద్దిపేట కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు దైనందిన జీవితంలో వ్యాయామం, యోగాను అలవాటు చేసుకోవాలని కోరారు. గజ్వేల్ రన్నర్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రోమో రన్ లో సిద్దిపేట పోలీస్ భాగస్వామ్యం అవుతుందని, గజ్వేల్ ప్రోమో రన్ లో యువతీ, యువకులు, విద్యార్థిని, విద్యార్థులు, ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గజ్వేల్ రన్నర్స్ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అభినందించిన సీపీ, పోలీస్ సపోర్ట్ పూర్తి స్థాయిలో ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రస్తుత యువత మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి భవిష్యత్ అంధకారంలోకి వెళ్లకుండా గజ్వేల్ రన్నర్స్ యువతకు ఆదర్శంగా ఇలాంటి రన్స్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. యువత గంజాయి, డ్రగ్స్ కు దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. వారితో రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు రాజు, నిఖిల్ రెడ్డి, జంగం రమేష్, కె. మధుసూదన్ రెడ్డి, సత్యం, దుంబాల లింగారెడ్డి, తాళ్ల నరేష్ గౌడ్, అష్రఫ్ తదితరులు ఉన్నారు.

## శీలపల్లి తండాలో సీసీ రోడ్డు నిర్మాణం...



**జహీరాబాద్, మార్చి 24 (మన వార్త):** ఝరాసంగం మండలం శీలపల్లి తండాలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ సుశీలభాయి ప్రారంభించారు. ఎంజీఎన్ఆర్ఈజీఏ పథకం కింద మంజూరు అయిన 5 లక్షల రూపాయల నిధులతో 100 మీటర్ల రోడ్డును నిర్మిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. రోడ్డు నిర్మాణ పూజా కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రేమ్ సింగ్, నాయకులు విజయ్ రాథోడ్, రాహుల్ రాథోడ్, వాచురాథోడ్, రమేష్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## అల్వాల్‌లో అక్రమ నిర్మాణాల దందా..!

**–దళారుల దౌర్జన్యం టౌన్ ప్లానింగ్‌కు సవాల్...**

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మార్చ్ 24 మన వార్త :**అల్వాల్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల వ్యవహారం రోజురోజుకూ మరింత భయంకర రూపం దాల్చుతోంది. ఇప్పటికే అనుమతులు లేకుండా కమర్షియల్ భవనాలు, బహుళ అంతస్తుల కట్టడాలు నిర్మించడం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుండగా, ఇప్పుడు దీనికి మరో ప్రమాదకర కోణం బయటపడుతోంది. స్థానికంగా కొందరు దళారులు ఏకంగా టౌన్ ప్లానింగ్ సిబ్బందినే బెదిరిస్తున్నారన్న ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. "మేము ఇక్కడ లోకల్ వాళ్ళండ మేము చెప్పింది చేయాలి" అంటూ అధికారులపై ఒత్తిడి తెస్తూ, చట్టాలను తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం. ఇది కేవలం అక్రమ నిర్మాణాల సమస్య మాత్రమే కాదుడ ప్రభుత్వ వ్యవస్థను సవాల్ చేసే స్థాయికి చేరిన పరిస్థితి. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులే బెదిరింపులకు గురవుతుంటే, సాధారణ ప్రజల పరిస్థితి ఏంటి అన్న ప్రశ్న తలెత్తుతోంది. 75 గజాల లోపు స్థలాల్లో నివాస గృహాల కోసం మాత్రమే అనుమతించిన 'సెల్ఫ్ సర్టిఫికేషన్' విధానాన్ని కొందరు దుర్వినియోగం చేస్తూ, కమర్షియల్ భవనాలు నిర్మించడం గమనార్హం. ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధం అయినప్పటికీ, దళారుల జోక్యం వల్ల చర్యలు తీసుకోవడంలో అధికారులు వెనుకడుగు వేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంకా పరిస్థితి ఎంత దారుణంగా మారిందంటే, రోడ్లపైనే నిర్మాణ సామగ్రి పోసి ప్రజల రాకపోకలను అడ్డుకుంటూ పనులు కొనసాగిస్తున్నారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ సమస్యలు అన్నవి పూర్తిగా పక్కన పెట్టి అక్రమంగా నిర్మాణాలు సాగుతుండటం అధికార వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనం. ప్రజలు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. "చట్టం బలహీనమా? లేక దళారులే బలమైనవారా?" అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. టౌన్ ప్లానింగ్ సిబ్బందికి రక్షణ కల్పించి, బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అల్వాల్ లో ఇప్పుడు ప్రశ్న ఒక్కటే చట్టం గెలుస్తుందా? లేక దళారుల దౌర్జన్యమే కొనసాగుతుందా?.



## లొంగిపోయాను పునరావాసం కల్పించండి...



**ఎల్లారెడ్డిపేట మార్చి 24: (మన వార్తా ప్రతినిధి)**భార్య పిల్లలతో బ్రతకడం కోసం వ్యవసాయం భూమి ఇప్పించండి పీపుల్స్ వార్ మాజీ దళ సభ్యులు ఉత్తం శ్రీనివాస్ అలియాస్ సాగర్ 4.సంవత్సరాలు నక్సలైట్ జీవితం గడిపి 1993 లో ప్రభుత్వానికి లొంగిపోయాను బార్య పిల్లలతో బ్రతకడం కోసం వ్యవసాయం భూమి ఇప్పించి పునరావాసం కల్పించాలని వీర్నపల్లి మండలం అడవిపదిర గ్రామానికి చెందిన పీపుల్స్ వార్ మాజీ దళ సభ్యులు ఉత్తం శ్రీనివాస్ అలియాస్ సాగర్ జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ ని స్వయంగా మంగళవారం కలిసి మొరపెట్టుకున్నారు,తాను 10-07-1989 లో పీపుల్స్ వార్ పార్టీ లో చేరి దళ సభ్యుడిగా అజ్ఞాత జీవితంలోకి వెళ్లి దాదాపు 4 సంవత్సరాలు నక్సలైట్ జీవితం గడిపాను అని ఆయన వెల్లడించారు, అప్పటి ప్రభుత్వం అదికారుల పిలుపు మేరకు అప్పటి కరీంనగర్ జిల్లా ఎస్పి ముందు తేదీ 01- 05-1993 లొంగి పోయానన్నారు, అటు తరువాత వివాహం చేసుకొవడం అనంతరం ఇద్దరు పిల్లల సంతానం కలగడం బార్యా ఇద్దరు పిల్లలతో పేదరికంతో జీవిస్తున్నా అన్నారు,మాకు ఏలాంటి స్థిర చర ఆస్తులు లేకపోవడం తన బార్య పిల్లలం బ్రతకడం కష్టంగా వుందన్నారు,తనకు పునారావాసం క్రింద ప్రభుత్వం వ్యవసాయ భూమి ఇవ్వాలని అప్పటి కలెక్టర్ వీరబ్రహ్మయ్య జిల్లా ఎస్పి స్థానిక అదికారులకు సిఫారసు చేయగా ఇప్పటి వరకు తన కుటుంబానికి వ్యవసాయ భూమి ఇవ్వనందున భార్య పిల్లలను పోషించుకోవడం ఇబ్బందిగా ఉన్నందున ఇప్పటికైనా పునరావాసం కింద ఒక ఇల్లు వ్యవసాయ భూమి ఇప్పించాలని ఆయన జిల్లా కలెక్టర్ ను జిల్లా ఎస్పీని స్వయంగా కలిసి వేడుకున్నారు

# రాంచంద్రాపురం కాలనీలో డ్రైనేజీ పనులపై

**మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణ**

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మార్చి 24 మన వార్త :** అల్వాల్ పరిధి లోని రాంచంద్రాపురం కాలనీలో కొనసాగుతున్న మురుగు కాలువ (సీవరేజ్ పైప్‌లైన్) పనులను ఎక్స్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ,డీజీఎం వెంకటేశ్వర్లు, అధికారులు శేఖర్, రాజు, రామానుజం, అమూల్ తదితరులు పాల్గొన్నారు.కాలనీలో జరుగుతున్న పైప్‌లైన్ పనుల పురోగతిని శాంతి శ్రీనివాస్ రెడ్డి సమగ్రంగా పరిశీలించారు. పనుల నాణ్యత, వేగం, అమలు విధానంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, పనులు ఎటువంటి లోపాలు లేకుండా కొనసాగాలని సూచించారు.ఈ సందర్భంగా స్థానిక నివాసితులతో మాట్లాడి, వారి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్యల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆమె గమనించి, వాటికి తక్షణ పరిష్కారం చూపాల్సిన అవసరాన్ని అధికారులకు వివరించారు.పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్‌కు ముఖ్యమైన ఆదేశాలు జారీ చేస్తూ, పైప్‌లైన్ స్థాయిలు సరిగా ఉండేలా చూసుకోవాలని, భవిష్యత్తులో ఎటువంటి లీకేజీలు లేదా మురుగు నిల్వలు లేకుండా పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. అలాగే పనులను ఆలస్యం చేయకుండా వేగవంతంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని పనులు చేయాలని, రోడ్లపై తవ్వకాల వల్ల కలిగే ఇబ్బందులను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కూడా ఆమె అధికారులకు సూచించారు.స్థానికులు కూడా ఈ పర్యటనపై సానుకూలంగా స్పందిస్తూ, సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని స్పందించినందుకు శాంతి శ్రీనివాస్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.రాంచంద్రాపురం కాలనీలో జరుగుతున్న డ్రైనేజీ పనులపై ఎక్స్ కార్పొరేటర్ స్వయంగా పర్యవేక్షణ చేయడం స్థానికులకు నమ్మకం కలిగిస్తోంది.పనులు త్వరగా, నాణ్యతతో పూర్తైతే కాలనీలో డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# మల్కాజ్‌గిరిలో ఇస్కాన్ దేవాలయానికి మార్గం సుగమం...

**-ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వినతి"...**

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మార్చి 24 మన వార్త :**మల్కాజ్‌గిరి నియోజకవర్గ అభివృద్ధి, ఆధ్యాత్మిక పురోగతికి మరో కీలక ముందడుగు పడింది. ఈరోజు మల్కాజ్‌గిరి నియోజకవర్గ శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి అసెంబ్లీలో దేవాదాయ శాఖ మంత్రివర్యులు కొండ సురేఖను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సికింద్రాబాద్ మహేంద్రహిల్స్ ప్రాంతంలో ఉన్న శ్రీ జయగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం సమీపంలో అంతర్జాతీయ ఆధ్యాత్మిక సంస్థ అయిన ఇస్కాన్ కు దేవాదాయ శాఖకు చెందిన భూమిని కేటాయించాలని ఎమ్మెల్యే మంత్రివర్యులను కోరారు.ప్రపంచవ్యాప్తంగా ఆధ్యాత్మిక సేవలందిస్తున్న ఇస్కాన్ సంస్థ భగవద్గీత బోధన, యువతకు నాయకత్వ శిక్షణ, సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా శిక్షణ వంటి విభిన్న కార్యక్రమాల ద్వారా సమాజానికి విశేష సేవలందిస్తున్నదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అదేవిధంగా అన్నదానం, ప్రసాదం పంపిణీ వంటి సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఆధ్యాత్మికతతో పాటు సామాజిక సేవలను కూడా అందిస్తున్నదని ఆయన వివరించారు.ఈ నేపథ్యంలో సుమారు 500 నుంచి 1500 చదరపు గజాల భూమిని కేటాయించి, శ్రీకృష్ణ దేవాలయం, కళ్యాణ మండపం, అలాగే ఆధ్యాత్మిక మరియు నైతిక విద్యా కార్యక్రమాల కోసం అవసరమైన వసతులను ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.ఈ వినతిపై మంత్రి కొండ సురేఖ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఈ ప్రతిపాదన అమలులోకి వస్తే మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత బలపడటంతో పాటు, యువతకు నైతిక విలువలు, సాంస్కృతిక అవగాహన పెరుగుతుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు.ఇస్కాన్ వంటి అంతర్జాతీయ స్థాయి సంస్థకు భూమి కేటాయింపు జరిగితే, మల్కాజ్‌గిరి నియోజకవర్గం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కేంద్రంగా రూపుదిద్దుకునే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.ప్రజలకు ఆధ్యాత్మికతతో పాటు సేవా కార్యక్రమాలు అందించే ఈ ప్రాజెక్ట్ త్వరలోనే రూపుదిద్దుకుంటుందనే ఆశలు వ్యక్తమవుతున్నాయి.



# బడ్జెట్‌లో జర్నలిస్టుల సంక్షేమ నిధి ఊసే లేదు...



**పెబ్బేరు.మార్చి 24( మన వార్త ప్రతినిధి)**బడ్జెట్‌లో జర్నలిస్టుల సంక్షేమ నిధి, ఇళ్ల స్థలాలు, హెల్త్ స్కీమ్ ముచ్చట అసలే లేదని వనపర్తి జిల్లా టిఆర్పి యూత్ అధ్యక్షులు జి. రవికుమార్ ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జర్నలిస్టులు ఎప్పుడూ ప్రజల కోసం నిజాలను వెలికితీసే బాధ్యతనుతీసుకుంటారని,వారికి రక్షణగా ఉండే సంక్షేమ నిధిని బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం చాలా దురదృష్టకరం.ఇది జర్నలిస్టుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమనిఆరోపించారు.ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ నిత్యం ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చే జర్నలిస్టులకు ప్రభుత్వం బడ్జెట్‌లో మొండిచేయి చూపిందని కోరారు.ఇండ్ల స్థలాల విషయంలో త్వరలోనే తీపి కబురుచెబుతామని,ఉద్యోగులతో సమానంగా హెల్త్‌కార్డులు ఇస్తామని పదేపదే చెప్పిన సర్కారు బడ్జెట్‌లో మాత్రం వాటి ఊసే ఎత్తలేదని తెలిపారు. కనీసం జర్నలిస్టుల ప్రస్తావన కూడా బడ్జెట్‌లో ఎక్కడా లేకపోవడం పట్ల పాత్రికేయ సంఘాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయని కోరారు.చనిపోయిన పాత్రికేయుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం,హెల్త్‌కార్డులు,వివిధ పథకాల్లో జర్నలిస్టులకు ప్రాధాన్యతనివ్వడం వాటి సంక్షేమలను తక్షణమే కొనసాగించాలని అన్నారు.ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వంపైనా జర్నలిస్టులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని సూచించారు. ఈ బడ్జెట్‌లో జర్నలిస్టుల సంక్షేమానికి తగిన చర్యలు చేపడుతుందని అందరూ ఆశించారు.కానీ,సంక్షేమ నిధిని కేటాయిస్తామని చెప్పి చిల్లి గవ్వ కూడా కేటాయించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బడ్జెట్‌లో జర్నలిస్టులకు వారి సంక్షేమానికి న్యాయం చేయాలని కోరారు.

# హనుమాన్ విజయయాత్ర ర్యాలీ సన్నాహక సమావేశం...



**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 24** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని స్థానిక మద్ది నరసింహా రెడ్డి గార్డెన్స్ లో మంగళవారం రోజు బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో వర్కింగ్ ప్రెసిడెంట్ పోల శ్రీనివాస్ గుప్తా అధ్యక్షతన జరిగిన వీర హనుమాన్ విజయయాత్ర ర్యాలీ సన్నాహక సమావేశం నిర్వహించి పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గీస ఆనంద్ మాట్లాడుతూ త్యాగమయ జీవితంలో మానవ సమాజానికి ఆదర్శమూర్తిగా కొని యాడబడుతూ చిరంజీవిగా నిలిచిన , వీర హనుమాన్ విజయ యాత్ర ర్యాలీ సందర్భంగా ధర్మ రక్షణలో హనుమంతుడు చూపిన దారిలో రామరాజ్య స్థాపనకై అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. యాదాద్రి జిల్లా బజరంగ్ దళ్ కన్వీనర్ బింగి భరత్ కుమార్ మాట్లాడుతూ హనుమంతుడి ని ఆదర్శంగా తీసుకొని భువనగిరి పట్టణంలో ఏప్రిల్ 2 గురువారం రోజు జరగ బోయే ర్యాలీలో నేటి యువత కదిలి వచ్చి శక్తి ప్రదర్శన చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళ పల్లి శ్రీవాణి , వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల , ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘచాలక్ బాదం ప్రకాష్ , విభాగ్ సహకార్యవహ తాడెం పాండుజి , బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాశం భాస్కర్ , టిఆర్ఎస్ కౌన్సిలర్ నాకోటి నరేష్ , హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి దేవరకొండ నరసింహ చారి , విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు పసుపు నూరి మనోహర్ , సుక్కల శ్రీశైలం యాదవ్ , కోశాధికారి చామ రవీందర్ , జిల్లా సామాజిక సమరసత ప్రముఖ్ కేమోజు మల్లికార్జున చారి , లీగల్ కన్వీనర్ సెల్వేర్ , సత్సంగ్ ప్రముఖ్ పెద్దగాని శ్రీనివాస్ , పట్టణ అధ్యక్షులు కందికొండ సహదేవ్ , బిజెపి పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరాం , సుర్వి శ్రీనివాస్ , ఉడుత భాస్కర్ , సత్సంగ్ ప్రముఖ్ వాళ్ళబోజు సతీష్, బజరంగ్ దళ్ పాదరాజు మనోజ్ , మేకల భాను జిల్లా గౌరక్ష ప్రముఖ్ నమిలే నవీన్, పట్టణ కన్వీనర్ జడల అక్షయ్, పొన్నాల వినయ్, పూర్తి సమయ కార్యకర్త పూస శ్రీనివాస్, ఏబీవీపీ సుర్వి మణికంఠ, శ్రీరామోజు ఆనంద్ రావుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# చీపునుంతల కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక...



**కల్వకుర్తి మార్చి 24 మన వార్త ప్రతినిధి** తలకొండపల్లి మండలం, చీపునుంతల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని గ్రామ నాయకుల అందరి సమక్ష్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.గ్రామ అధ్యక్షులుగామలేరామచంద్రారెడ్డి,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా మిడతా శేఖర్, బీసీ. సెల్ అధ్యక్షులుగా బత్తుల మల్లేష్ గౌడ్, మరియు ఎస్సీ సెల్ అధ్యక్షులుగా గోస్కె శ్రీశైలం ఈ విధంగా 60 మందితో నూతన కమిటి నీ ఎన్నుకోవడం జరిగింది. మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ అధ్యక్షులు ఈ కమిటీ కీ గౌరవ అధ్యక్షులుగా కొనసాగుతారు అని అధ్యక్షులు తెలిపారు.నూతన అధ్యక్షులు మలే రామచంద్రారెడ్డిమాట్లాడుతూకాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో తెలంగాణ అభివృద్ధి ప్రథంలో ముందుకు సాగుతుంది. అదేవిధంగా కల్వకుర్తి నియోజక వర్గం కూడా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి నాయకత్వంలో విద్య, వైద్యం,అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డినాయకత్వంలోఅందరం ఐక్యమాత్యంతో కలిసి..... మన గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామనితెలియజేశారు. ఈ అవకాశం కల్పించిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ, నాయకులు వెంకట్రాజీ రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి. తదితరులు పాల్గొన్నారు

# ఇసుక సరఫరా ఆన్లైన్ ద్వారా నే చేపట్టాలి...

**-సంబంధిత అధికారులకు సూచించిన జిల్లా కలెక్టర్...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 24** జిల్లాలో ఇసుక సరఫరా పూర్తి గా ఆన్లైన్ ద్వారా నే చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి , సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం రోజు కలెక్టరేట్ , వీడియో కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ , ఎస్పీ ఆకాంక్ష్ యాదవ్ జిల్లాలో ఇసుక సరఫరా , వినియోగం , నిల్వలు , రవాణా తదితర అంశాలపై ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ , రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి లతో కలిసి మైన్స్ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల అవసరాల కోసం,ప్రభుత్వ అవసరాల కోసం అవసర మైన ఇసుక ను పూర్తిగా ఆన్లైన్ విధానం లోనే చేసుకొని పొందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద నియమ నిబంధనలు కచ్చితంగా పాటించడంతో పాటు అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు. ప్రజలకు పారదర్శకంగా ఇసుక అందు బాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే , ఆన్లైన్ బుకింగ్ వ్యవస్థను సమర్థ వంతంగా అమలు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఇసుక నిర్వహణను మరింత సమర్థవంతంగా నిర్వ హించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి , శేఖర్ రెడ్డి , అసిస్టెంట్ డైరెక్టర్ మైనింగ్ రవికుమార్ , ఇరిగేషన్ యస్ ఈ రవీందర్ , జిల్లా రవాణా అధికారి హరికృష్ణా , సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




# గ్రామంలో దళితులపై వివక్ష భీమ్ ఆర్మీ ఆగ్రహం






**-రాష్ట్ర కార్యదర్శి సాసాని...**

**నిజామాబాద్ జిల్లా ఆర్ సి రిపోర్టర్ పి.సుధాకర్ ( మన వార్త ) మార్చి 24** కామారెడ్డి జిల్లా నర్సన్నపల్లి గ్రామంలో దళితులపై వివక్ష చూపుతూ, గ్రామ బహిష్కరణకు పూనుకున్న అగ్రకులాలపై పోలీస్ శాఖ తక్షణమే చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని భీమ్ ఆర్మీ రాష్ట్ర కార్యదర్శి సాసాని సందీప్, నిజామాబాద్ జిల్లా డిస్ట్రిక్ట్ ఇంచార్జ్ భీమ్ ఆర్మీ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు టీ.ఎన్ రమేష్ రావు సంయుక్తంగా డిమాండ్ చేశారు.అధికార యంత్రాంగం వెంటనే స్పందించి, బాధిత కుటుంబాలకు రక్షణ కల్పించడంతో పాటు న్యాయం చేయాలని వారు కోరారు. అలాగే, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# చిన్న శంకరంపేటలో తైబజార్ వేలం...

**-12,30,000 స్వాధీనం చేసుకున్న దత్తు ...**

**చిన్న శంకరంపేట మార్చి 24 ( మన వార్త ప్రతినిధి )** చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ ఆవరణలో నేడు గ్రామపంచాయతీ తైబజార్ వేలం పాటను పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు, వేలం పాటలో పాల్గొన్న నిద్రబొయిన దత్తు 12 లక్షల 30 వేల రూపాయలకు కైవసం చేసుకున్నారు,ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఆవరణలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తై బజారును వేలం వేయడం జరిగిందని గత సంవత్సరం 10 లక్షల 50 వేల రూపాయలకు వేలం కాగా ఈ సంవత్సరం 12 లక్షల 30 వేల రూపాయలకు వేలం పాటలో పాల్గొని నిద్రబొయిన దత్తు కైవసం చేసుకున్నారు వేలంపాటలలో మొత్తం ఏడుగురు వ్యక్తులు పాల్గొనగా వారిలో అధిక వేలం పాట పాడి తైబజార్ను నిద్రబోయిన దత్తు కైవసం చేసుకున్నట్లు ఆయన తెలిపారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రశేఖర్, ఉప సర్పంచ్ భానుప్రసాద్, పంచాయతీ ఈవో ప్రదీప్, పంచాయతీ పాలవర్గ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.



# వెంకటాపురంలో రోడ్డుపై చెత్త...

**-ఫిర్యాదులు చేసినా స్పందించని జిహెచ్ఎంసి!"**

**అల్వాల్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మార్చి 24 మన వార్త :** అల్వాల్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని వెంకటాపురం డివిజన్, రోడ్ నెంబర్ 15లో చెత్త సమస్య తీవ్రంగా మారి స్థానిక ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. ఓపెన్ ప్లాట్ కారణంగా భారీగా చెత్త కుప్పలు పేరుకుపోవడంతో ఆ ప్రాంతం మొత్తం దుర్వాసనతో నిండిపోతోంది.ప్రతి రోజూ పెరుగుతున్న చెత్తతో దోమలు విపరీతంగా పెరిగి, కాలనీ ప్రజలు ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.స్థానికుల ప్రకారం, ఈ ఓపెన్ ప్లాట్ యజమానికి పలుమార్లు సమాచారం ఇచ్చినా, ఇప్పటివరకు ఎటువంటి ఫెన్సింగ్ లేదా శుభ్రపరిచే చర్యలు తీసుకోలేదు. దీంతో ఈ స్థలం చెత్త పారబోయే ప్రదేశంగా మారిపోయింది. పరిస్థితి రోజురోజుకూ దిగజారుతూ ప్రజల జీవనానికి ముప్పుగా మారుతోంది.ఇక రాత్రి వేళల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. వీధి దీపాలు లేకపోవడంతో చీకట్లో ప్రజలు భయంతో ప్రయాణించాల్సి వస్తోంది. మహిళలు, వృద్ధులు రాత్రిపూట బయటకు రావడానికి కూడా భయపడుతున్నారని స్థానికులు చెబుతున్నారు.జిహెచ్ఎంసి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ఎటువంటి స్పందన లేకపోవడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది. సమస్య తీవ్రతను అర్థం చేసుకోకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.స్థానికుల డిమాండ్లు వెంటనే చెత్త కుప్పలను తొలగించాలి ప్లాట్ యజమానిపై కఠిన చర్యలు తీసుకోవాలి ఓపెన్ ప్లాట్‌కు ఫెన్సింగ్ ఏర్పాటు చేయించాలి వీధి దీపాలు ఏర్పాటు చేసి రాత్రి భద్రత కల్పించాలి వెంకటాపురం డివిజన్‌లో చెత్త సమస్య కేవలం ఒక ప్రాంతానికి పరిమితం కాదుఢ ఇది పట్టణ నిర్వహణలో ఉన్న లోపాలను బహిర్గతం చేస్తోంది.



## జనాభా లెక్కల ఛార్జ్ క్లర్క్ లకు 3 రోజుల శిక్షణ...

**-ప్రారంభించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు...**
**-జనగణన దేశ అభివృద్ధికి ముఖ్యమైన ప్రాథమిక సమాచార సేకరణ ప్రక్రియ...**





**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 24** జనగణన-2027 ఫేస్-1 గృహాల జాబితా , గృహ గణన నిర్వహణలో భాగంగా నూతనంగా ఎంపికైన టెక్నికల్ అసిస్టెంట్లు , జనాభా లెక్కల ఛార్జ్ క్లర్క్ లకు మంగళవారం రోజు జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరం లోమూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర హాజరై , నూతనంగా ఎంపికైన వారికి పలు కీలక సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ టెక్నికల్ అసిస్టెంట్ , ఛార్జ్ క్లర్క్ లకు శిక్షణ కార్యక్రమం నేటి నుంచి మూడు రోజుల (24 నుంచి 26) పాటు ఉంటుందని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ మాట్లడుతూ జనగణన దేశ అభివృద్ధికి ముఖ్యమైన ప్రాథమిక సమాచార సేకరణ ప్రక్రియ అని తెలిపారు. ప్రతి వివరాన్ని ఖచ్చితంగా నమోదు చేసే విధానాన్ని , అలాగే టెక్నికల్ అసిస్టెంట్లు సాంకేతిక పరికరాల వినియోగంపై పూర్తి అవగాహన కల్పించాలని , డేటా సేకరణలో పార దర్శకత పై , ఇతర వివరాలపై మీరందరూ ఈ శిక్షణలో ప్రతి అంశాన్ని బాగా నేర్చు కోవాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సీపీఓ వెంకటరమణ , తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తం చేసిన ఆశ వర్కర్లు...



**చేగుంట మార్చి 24 ( మన వార్త ప్రతినిధి)** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలో ఆశ వర్కర్ల డిమాండ్లను నెరవేరుస్తామని చెప్పి ఎన్నికలయ్యాక గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆశ వర్కర్లను పూర్తిగా విస్మరించిందని, ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ఆశ వర్కర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మెదక్ జిల్లా అధ్యక్షురాలు సమత డిమాండ్ చేశారు, చేగుంట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు ఆశ వర్కర్లు వినూత్న నిరసన చేపట్టారు, వారి డిమాండ్లను తెలియజేస్తూ బతుకమ్మ పాటలు పాడుతూ ఆట ఆడుతూ నిరసన వ్యక్తం చేశారు అనంతరం వైద్యాధికారి డాక్టర్ అనిల్ కు వినతి పత్రాన్ని అందజేశారు, ఈ సందర్భంగా ఆశా వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సమత మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఆశ వర్కర్లకు 18 వేతనాన్ని అందించాలని వారి డిమాండ్ చేశారు గత రెండు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆశ వర్కర్లపై ప్రభుత్వం చిన్న చూపు తగదని వెంటనే ప్రభుత్వం స్పందించి ఆశ వర్కర్ల డిమాండ్లను నెరవేర్చకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆమె హెచ్చరించారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు అన్నింటినీ కూడా ప్రజలకు చేరవేస్తూ అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు సేవలు అందిస్తున్నామని ఆమె తెలిపారు ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని ఆమె కోరారు ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మెదక్ జిల్లా అధ్యక్షురాలు సమత, సత్తెమ్మ, లావణ్య, షేకమ్మ, భూదేవి, లక్ష్మి, అరుణ, సుశీల, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు అరెస్ట్..




**జమ్మికుంట,మార్చి 24( మన వార్త ప్రతినిధి):** వడ్డెర సంఘం అధ్యక్షుడుని పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.తెలంగాణ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వడ్డెరల ఆత్మ గౌరవ కోసం అసెంబ్లీ ముట్టడి కి వెళ్తున్న వడ్డెర సంఘం జమ్మికుంట మండల అధ్యక్షుడు పల్లపు రవిని పోలీస్ లు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఎన్ని అక్రమ అరెస్ట్ లు చేసిన వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు అయ్యేవరకు మా పోరాటం ఆగదని అన్నారు.అలాగే వడ్డెర కులాన్ని ఎస్టిలో చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## నారాయణపల్లిలో వన్యప్రాణి వేట కేసు నమోదు కమ్మర్‌పల్లి రేంజ్‌లో పెద్దపులి సంచారం, ప్రజలకు హెచ్చరిక

**నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం (మన వార్త) మార్చ్ 24** నారాయణపల్లి గ్రామం (న్యావనంది 6.9 పరిధి)లో వన్యప్రాణి వేటకు సంబంధించిన ఘటన వెలుగులోకి వచ్చింది. 23-05-2026 న ఒక వ్యక్తి పంది మాంసంతో పట్టుబడగా, అతనిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం, 1972 ప్రకారం కేసు నమోదు చేయబడింది. ఈ కేసు P.O.R.No. 30-40/187, తేదీ 23-05-2026 గా నమోదు చేశారు.అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, వన్యప్రాణులను ఎవరైనా వేటాడినచో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు వన్యప్రాణులను వేటాడకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.ఇక కమ్మర్‌పల్లి రేంజ్ పరిధిలో నిన్నటి రాత్రి నుండి పెద్దపులి సంచారం ఉన్నట్లు సమాచారం. దీనిని దృష్టిలో ఉంచుకుని, స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రజలు ముఖ్యంగా:సాయంత్రం, రాత్రి, తెల్లవారుజామున అడవికి వెళ్లవదు ఒంటరిగా బయటకు వెళ్లకూడదుఅడవి పరిసరాలు, పొలాల వద్ద కరెంటు తీగలు వేయవద్దు అలాగే, పశువులను గ్రామ పరిధిలోనే సురక్షితంగా ఉంచుకోవాలని సూచించారు.పెద్దపులి వంటి వన్యప్రాణులను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, వాటిని కాపాడాలని అధికారులు పిలుపునిచ్చారు.

## రబీ సీజన్ కి ధాన్యం కొనుగోలు జరిగేలా చూడాలి...



**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 24** రబీ సీజన్ కి సంబంధించి వరి ధాన్యం కొనుగోలు నిర్వహణ ప్రక్రియను సజావుగా జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రోజు మినీ మీటింగ్ హాల్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు పై వ్యవసాయ , మార్కెట్ , రవాణా , గ్రామీణాభివృద్ధి , కో-ఆపరేటివ్ , మిల్లర్లు తదితర శాఖల అధికారులతో రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి లతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా కేంద్రాలకు వచ్చే ధాన్యం కొనుగోలు పక్కాగా జరగాలన్నారు. అన్ని కేంద్రాల్లో ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా త్రాగునీరు కరెంటు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. కేంద్రాలకు ఏ రోజు వచ్చే ధాన్యం అదే రోజు కొనుగోలు జరిగి , అదేరోజు మిల్లులకు తరలించేలా చర్యలు తీసు కోవాలన్నారు. మిల్లర్లు లోడింగ్ ధాన్యం ను వెంటనే తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలుకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే టార్పాలిన్లు , ధాన్యాన్ని తూర్పార పట్టే యంత్రాలు , గన్నీ సంచులు , వెయింగ్ మెషీన్ లు , తదితరాలు పరికరాలు అన్నీ కొనుగోలు కేంద్రాలలో సరిపడా అందు బాటులో ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలన బృందాల చే ఆకస్మిక తనిఖీలు చేపట్టి కొనుగోలు ప్రక్రియను పర్య వేక్షణ చేయాలన్నారు. ఈ సమావేశంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి , శేఖర్ రెడ్డి , సివిల్ సప్లై మేనేజర్ హరి కృష్ణ , జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి , సివిల్ సప్లై అధికారి రోజారాణి , జిల్లా వ్యవసాయ అధికారి రమణ రెడ్డి , జిల్లా తూనిక , కొలతల అధికారి వెంకటేష్ , జిల్లా కోపరేటివ్ అధికారి మురళి , మిల్లర్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుడుగొల్ల రమేష్ కుటుంబానికి ఆర్థిక సహాయం వారి పిల్లల చదువు కోసం భరోసా:తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి...




**కల్వకుర్తి.మార్చి 24 మన వార్త ప్రతినిధి.** కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండా మండలం, చేర్మూర్ గ్రామానికి చెందిన గొల్ల రమేష్ నిన్న రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు.ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది.ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఈరోజు ఉదయం మృతుడి నివాసానికి చేరుకుని నివాళులు అర్పించారు. పూలమాలలు వేసి రమేష్‌కు శ్రద్ధాంజలిఘటించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు ఈ సందర్భంగా ఆయన బాధిత కుటుంబానికి తక్షణ సహాయంగా 10,000 వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే రమేష్ పిల్లలచదువులకు తాను సహాయం చేస్తానని హామీ ఇచ్చారు.రోడ్డు ప్రమాదాలపై గోలి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆందోళనఈ ఘటన నేపథ్యంలో నేషనల్ హైవే ఎన్.హెచ్.-765 పై జరుగుతున్న వరుస రోడ్డు ప్రమాదాలపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఇటీవల నెల రోజుల వ్యవధిలోనే 10కి పైగా మరణాలు సంభవించాయని పేర్కొన్నారు.ఈ ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులతో మాట్లాడారురోడ్డు భద్రతపై నిర్లక్ష్యం వహించరాదని ప్రమాదాలను అరికట్టేందుకు కఠిన చర్యలు అవసరమని ఆయన స్పష్టం చేశారు.ప్రజల ప్రాణాల రక్షణ ప్రభుత్వ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో చేర్మూర్ గ్రామ సర్పంచ్ బచ్చలకూరశ్రీనివాసులు,రాఘుయిపల్లి సర్పంచ్ వెంకటయ్య,మాజీ ఎంపీటీసీ భీమయ్య,మాజీ ఉప సర్పంచులు నరసింహ,నరసింహ, నాయకులు మైసయ్య,నాయక్ శ్రీను,లాలయ్య,కొండల్, రమేష్, అలీల్, మాజీ సర్పంచ్ శంకర్ నాయక్,జంగయ్య,జంగ్లీ ఆనంద్,బాలకృష్ణ,సతీష్,కుమార్,శివ,గణేష్,భారత్, చింటు తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



**వేములవాడ మార్చి 24 (మన వార్త )** వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలు, రికార్డులను సమగ్రంగా పరిశీలించారు.కేసుల దర్యాప్తులో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని, పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేసి, చట్టపరంగా నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలని ఆదేశించారు.ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా విలేజ్ పోలీస్ ఆఫీసర్ (VPO) వ్యవస్థను పకడ్బందీగా అమలు చేయాలని, వార్డులు, గ్రామాలను నిరంతరం సందర్శిస్తూ ప్రజలతో మమేకమై నేర నియంత్రణలో భాగస్వామ్యం కావాలని సూచించారు. ప్రజా ఫిర్యాదులపై ఆలస్యం చేయకుండా బాధితులకు తక్షణ స్పందన ఇవ్వాలని తెలిపారు.పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, డయల్ 100 కాల్స్‌కు వెంటనే స్పందిస్తూ సంఘటనా స్థలానికి త్వరితగతిన చేరుకోవాలని బ్లూ కోల్ట్, పెట్రోల్ వాహన సిబ్బందిని ఆదేశించారు. పెట్రోలింగ్ సమయంలో రౌడీ షీటర్లపై నిఘా ఉంచాలని పేర్కొన్నారు.నేరాల నివారణలో భాగంగా సీసీటీవీ కెమెరాల ఏర్పాటు పెంచాలని,కీలక ప్రదేశాల్లో మరిన్ని కెమెరాలు అమర్చేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని, "Arrive Alive" కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, ట్రిపుల్ రైడింగ్, మైనర్ల డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్,ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ పాల్గొన్నారు.

## వేములవాడలో శ్రీరామనవమి కళ్యాణోత్సవానికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు:జిల్లా ఎస్పీ



**వేములవాడ మార్చి 24 (మన వార్త )** వేములవాడ రాజన్న క్షేత్రంలో ఈ నెల 27న జరగనున్న శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం సందర్భంగా భారీగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అధికారులకు సూచించారు.మంగళవారం రోజున ఆలయ అధికారులు, పోలీస్ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో ఆలయ పరిసరాలు, శివార్చన ప్రదేశం,పార్కింగ్ ప్రదేశాలు పరిశీలించి పలు సూచనలు చేసారు.ఈసారి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శివార్చన వేదికపై శ్రీ సీతారాముల వారి కళ్యాణోత్సవం నిర్వహించనున్నా నేపథ్యంలో భక్తులకు సులభంగా, సౌకర్యవంతంగా దర్శనం కల్పించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని తెలిపారు.భక్తుల భద్రతా దృష్ట్యా బ్యారికేడ్లు,కళ్యాణోత్సవం అనంతరం స్వామివారిని దర్శించుకునేందుకు ప్రత్యేక క్యూలైన్లు,పార్కింగ్ సదుపాయాలపై , సైన్ బోర్డ్స్ పై ప్రత్యేక దృష్టి సారించి, ట్రాఫిక్ రద్దీని నియంత్రించే విధంగా ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు.భక్తుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఎస్పీ వెంట డిఎస్పీ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ వీరప్రసాద్, ఆలయ ఈ ఈ రాజేష్, డి.ఈ రఘునందన్, రామ్ కిషన్ రావు సిబ్బంది పాల్గొన్నారు.

## జగ్జీవన్ రామ్, అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలి



**రాజన్న సిరిసిల్ల, మార్చి -24 (మన వార్త )** మహనీయులు బాబు జగ్జీవన్ రామ్, బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వచ్చేనెల (ఏప్రిల్) 5 వ తేదీన బాబు జగ్జీవన్ రామ్,ఏప్రిల్ 14వ తేదీన భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించ నుండగా, ఎస్సీ సంక్షేమ శాఖ ఆద్వర్యంలో సన్నాహక సమావేశం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం నిర్వహించగా ముఖ్య అతిథిగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. మహనీయులు బాబు జగ్జీవన్ రామ్, బీఆర్ అంబేద్కర్ భారత దేశ నిర్మాణంలో అందించిన విశేష సేవలను స్మరించుకునేందుకు ఏటా వారి జయంతి వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. మహనీయులు అందరి వారని పేర్కొన్నారు. ఆయా మహనీయుల జయంతి సందర్భంగా జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ఉన్న వారి విగ్రహాల వద్ద పారిశుధ్య పనులు ప్రతి రోజూ చేయించాలని సూచించారు. వేడుకలకు ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని ఆదేశించారు. ఎస్సీ సంక్షేమ శాఖ ఆద్వర్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో జయంతి వేడుకలకు ఘనమైన ఏర్పాట్లు చేసి విజయవంతం చేయాలని సూచించారు. సెస్ అధికారులు విద్యుత్ సరఫరాలో ఇబ్బంది లేకుండా చూడాలని, జిల్లా వైద్యాధికారి వైద్యులు, సిబ్బందితో శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ విద్యార్థుల హాస్టల్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, అన్ని రెసిడెన్షియల్, హాస్టల్ లలో గీజర్ సదుపాయం కల్పించామని తెలిపారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం, సౌకర్యాల పరిశీలనకు అన్ని రెసిడెన్షియల్, హాస్టల్స్, స్కూళ్లకు మండల, జిల్లా స్థాయి అధికారులను నియమించామని పేర్కొన్నారు. అనంతరం వివిధ సంఘాల ప్రతినిధులు పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డి, ఏఎస్ డబ్ల్యూఓ విజయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, జిల్లా వైద్యాధికారి రజిత, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎంని కలిసిన ఎంపీ కృష్ణయ్య ,పల్లగొర్ల మోదీ రాందేవ్...



**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 24** అసెంబ్లీ సీఎం ఛాంబర్ లో సీఎం రేవంత్ రెడ్డిని మంగళ వారం రోజు కలిసిన బీసీ జేఏసీ చైర్మన్ రాజ్యసభ ఎంపీ ఆర్ కృష్ణయ్య , బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీ రాందేవ్ పలు విషయాల పై వినతిపత్రాన్ని అందజేయడం జరిగింది. బీసీ రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని , విద్యార్థులకు రావలసిన ఫీజు బకాయిలు విడుదల చేయాలని , నిరుద్యోగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని , ఉద్యోగస్తులు రిటైర్డ్ ఉద్యోగస్తుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రరైతాంగ సమస్యలను పరిష్కరించాలని సీఎం రేవంత్ రెడ్డికి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య , బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్ , నీలా వెంకటేష్ , జిల్ల పెల్లి అంజి , పి. సతీష్ లు పాల్గొనడం జరిగింది.

## భీమన్నను దర్శించుకున్న ఉమ్మడి కరీంనగర్ విజిలెన్స్ ఎస్పీ...




**వేములవాడ మార్చి 24 (మన వార్త )**రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని ఉమ్మడి కరీంనగర్ జిల్లా విజిలెన్స్ ఎస్పీ శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ మండపంలో అర్చకులు, వేద పండితులు వారికి ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో ఎల్. రమాదేవి స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు, ఆలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## పాడిపశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ...



**ఇల్లందకుంట,మార్చి 24 (మన వార్త ప్రతినిధి );**మంగళవారం ఇల్లందకుంట మండలం పాతర్లపల్లి గ్రామంలో జాతీయ ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ బైరెడ్డి వెంకటరమణారెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ, పాడి రైతులు తమ పశు వులకు ఈ టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. ఈ ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు సుమారు 145కి పైగా పశువులకు టీకాలు వేశారు. పాడి రైతుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని సర్పంచ్ రమణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ విజేందర్ రావు, తిరుపతి జె వి ఓ రవీందర్ ఎల్ ఎస్ ఏ, కనకయ్య ఎల్ ఎస్ ఏ,ప్రేమ్ కుమార్ ఎల్ ఎస్ ఏ గోపాల మిత్రులు కోడం శ్రీనివాస్ ,నవీన్, చిరంజీవి,తిరుపతి,మహేందర్, సాయి తేజ, మరియు పాడి రైతులు పాల్గొన్నారు.

## అప్ టు డ్యూడ్ రీజనింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు శిక్షణ



**మన వార్త ప్రతినిధి గంధరావుపేట మార్చి 23** గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టాస్క్ మరియు కెరియర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఆప్టిట్యూడ్ మరియు రీజనింగ్ పైన శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది టాస్క్ అండ్ కెరియర్ గైడెన్స్ సెల్ కు ఆర్డినేటర్ డాక్టర్ జై శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వి విజయలక్ష్మి అధ్యక్షత జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపాల్ గారు మాట్లాడుతూ ఫైనల్ ఇయర్ విద్యార్థులందరూ కూడా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రీజనింగ్ అనేది మాత్రమే కాకుండా గ్రూప్ 1 గ్రూప్ 2 స్టాఫ్ సెలక్షన్ కమిషన్ బ్యాంకింగ్ వంటి ఎగ్జామ్స్ కి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు టాస్క్ కోఆర్డినేటర్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో విద్యార్థులు కోడింగ్ డీకోడింగ్ చేయడం పజిల్స్ తొందరగా చేయడం షార్ట్ కట్ మెథడ్స్ ఉపయోగించి తొందరగా ప్రాబ్లం సాల్వ్ చేయడం నేర్చుకోవాలని సూచించారు ఈ కార్యక్రమానికి రిసార్ట్స్ పర్సన్ గా మ్యాజిక్ బస్సు నాంది ఫౌండేషన్ నుండి ఈ సాగర్ బాబు విద్యార్థులకు ఆప్టిట్యూడ్ ఇంజనీరింగ్ పైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చాలా అంశాలపై వివరణలు ఇచ్చారు దాదాపు 50 నుంచి 60 మంది విద్యార్థులు పాల్గొని రిసోర్చ్ పర్సన్ ద్వారా ఆప్టిట్యూడ్ మరియు రిసలింగ్ పైన డౌట్స్ను నివృత్తి చేసుకున్నావు ఈ కార్యక్రమంలో కళాశాల విద్యాపకులు డాక్టర్ ఎం ప్రభాకర్ డాక్టర్ వై ఆంజనేయులు పాక ధర్మపురి ఆది విష్ణు వాణి మనోహర్ శ్రీనివాస్ బిక్షమయ్య సూచన కృష్ణ ప్రసాద్ తదితర అధ్యాపక అధ్యాపక కేతర బృందం పాల్గొన్నారు

## మున్సిపల్ పార్కు వద్ద పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణానికి భూమి పూజ చేసిన పుల్కాం రాజు



**వేములవాడ మార్చి 24 (మన వార్త )**రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సారథ్యంలో వేములవాడ పట్టణం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దబడుతోంది. పట్టణ ప్రజల అవసరాలను గుర్తించి, మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ఎమ్మెల్యే పర్యవేక్షణలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. ఇందులో భాగంగా, వేములవాడ పట్టణంలోని మండల పరిషత్ ఆవరణలో ఉన్న మున్సిపల్ పార్కు వద్ద సందర్శకులు, ప్రజల సౌకర్యార్థం రూ. 15 లక్షల భారీ వ్యయంతో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మంగళవారం మున్సిపల్ చైర్మన్ పుల్కాం రాజు అధికారులతో కలిసి ఈ పనులకు భూమి పూజ నిర్వహించారు. ౹ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కాం రాజు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. పార్కుకు వచ్చే వేలాది మంది సందర్శకులు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో ఈ నిధులను మంజూరు చేయించారని పేర్కొన్నారు. నాణ్యతతో కూడిన నిర్మాణాన్ని గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.౹పట్టణంలోని ప్రతి వార్డులో డ్రైనేజీలు, సిసి రోడ్లు, తాగునీటి సౌకర్యాలతో పాటు ఇలాంటి పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించడం ద్వారా పట్టణ పరిశుభ్రతకు, ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నట్లు ఆయన వివరించారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కృషితో వేములవాడ పట్టణం రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు. ౹ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, ఏఈ అనన్య, టీఓ అన్వేష్, స్థానిక కౌన్సిలర్లు, వివిధ విభాగాల మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు మరియు నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా అయిత సత్యనారాయణ పుష్పలత దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు



**గజ్వేల్ మార్చ్ 24 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో కొండ పోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ అయిత సత్యనారాయణ పుష్పలత దంపతుల 47వ వివాహ వార్షికోత్సవ వేడుకలు వారి నివాసంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా కొమురవెల్లి దేవస్థానం డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, ఇటిక్యాల మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు అయిత సత్యనారాయణ పుష్పలత దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందజేసి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక సేవలో ముందుండే అయిత సత్యనారాయణ దంపతులు ఇలాంటి వివాహ వార్షికోత్సవాలు మరెన్నో జరుపుకోవాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నేతి సంతోష్, గందే సంతోష్, ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

## బ్రహ్మోత్సవాలకు చైర్మన్ కు ఆహ్వానం..



**జమ్మికుంట, మార్చి 24( మన వార్త ప్రతినిధి):**అపర భద్రాద్రి గా పేరుగాంచిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ఈనెల 25 నుండి జరుగబోయే బ్రహ్మోత్సవాలకు రాగలరని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్),వైస్ చైర్మన్ లకు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక, జ్ఞాపిక ను దేవస్థానం చైర్మన్ ఇంగ్లే రామారావు, ఆలయ ధర్మకర్తలు అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని జమ్మికుంట మున్సిపల్ పక్షాన పారిశుద్యం, భక్తుల సౌకర్యార్థం త్రాగునీటి విషయంలో మరే విషయాలలోనైనా మేము మా పాలకవర్గం రాజకీయపార్టీలకు అతీతంగా అందుబాటులో ఉండి తమ వంతు సహాయ సహకారాలను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ( జావేద్) ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఫిన్‌లాండ్‌కు గురువు ఎంపిక...

**–రాష్ట్రంలో 28 మందిలో సిరిసిల్ల ఉపాధ్యాయుడికి చోటు..**

**ఇల్లంతకుంట,మార్చి 24 (మన వార్త ప్రతినిధి):**రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్



ఇల్లంతకుంట పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (బయోలాజీ)గా పనిచేస్తున్న వుడుత మహేశ్చంద్ర ఫిన్‌లాండ్‌లో నిర్వహించే అంతర్జాతీయ టీచర్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌కు ఎంపికయ్యారు. రాష్ట్రం నుంచి ఎంపికైన 28 మంది ఉపాధ్యాయుల్లో చోటు దక్కించుకోవడం విశేషంగా నిలిచింది. జిల్లా స్థాయిలో జరిగిన పోటీలో ప్రతిభ చాటుకుని ఆయన ఎంపికయ్యారని విద్యావర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఐదు రోజుల పాటు ఫిన్‌లాండ్‌లోని పలు విద్యాసంస్థలను సందర్శిస్తూ ఆధునిక బోధనా విధానాలపై శిక్షణ పొందనున్నారు. ప్రత్యేకంగా స్టూడెంట్ సెంట్రిక్ లెర్నింగ్,ఆధునిక బోధనా సాంకేతికతలు,కరిక్యులమ్ అభివృద్ధి,బయోలాజీ సైన్స్‌లో ప్రయోగాత్మక పద్ధతులపై అవగాహన పెంపొందించుకోనున్నారు. తిరిగి వచ్చిన అనంతరం ఈ అనుభవాన్ని విద్యార్థులకు ఉపయోగపడేలా అమలు చేయనున్నారు. ఇప్పటికే పాఠశాలలో విద్యార్థులను జాతీయ,రాష్ట్ర స్థాయి సైన్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చేలా తీర్చిదిద్దిన మహేశ్చంద్రకు ఈ ఎంపిక మరింత గుర్తింపును తెచ్చిపెట్టింది. గ్రామీణ పాఠశాలల నుంచే అంతర్జాతీయ స్థాయికి ఎదగగలమని ఈ సందర్భంగా స్పష్టమవుతోంది. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి జగన్మోహన్ రావు,డిస్ట్రిక్ట్ సైన్స్ ఆఫీసర్ పాముల దేవయ్య,సెక్టోరియల్ అధికారులు,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రేమలతతో పాటు ఉపాధ్యాయులు మహేశ్చంద్రను అభినందించారు.

## బి ఆర్ ఎస్ వి నాయకుల అరెస్ట్ పోలీస్ స్టేషన్ కు తరలింపు...




**చిన్న శంకరంపేట మార్చి 24 ( మన వార్త ప్రతినిధి)** బిఆర్ఎస్వి నాయకులను చిన్న శంకరంపేట పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు మంగళవారం చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం ఉన్నందున బీఆర్ఎస్వి నాయకులను చిన్న శంకరంపేట పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు, అరెస్ట్ అయిన వారిలో బి ఆర్ ఎస్ వి నాయకులు అత్తెల్లి నాగరాజు, లాలూ నాయక్, లు ఉన్నారు.

## పాతమార్కెట్ మద్యపానానికి నిలయం

**– విరివిగా మద్యం బాటిళ్లు...**
**– సెక్యూరిటీ వున్నా లేనట్టే...**




**జమ్మికుంట, మార్చి 24( మన వార్త ప్రతినిధి):**జమ్మికుంట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ చుట్టు ప్రక్కల ప్రాంతాలకు,జిల్లాలకు ఆదర్శం. పట్టణ వ్యాపారస్తులకు మార్కెట్ ఆయూపట్టులాంటిది. అలాంటి మార్కెట్ మందుబాబులకు అడ్డాగా మారుతుంది. పాత మార్కెట్ లో పంచాయితీలకు అడ్డాగా,మందుబాబులకు నిలయంగా తయారవుతుంది. సెలవు రోజులలో మరీ ఎక్కువవుతుంది. ఎక్కడపడితే అక్కడ మద్యం సేవించడం మద్యం బాటిళ్లు పగల గొట్టటం చేస్తున్నారు. పగిలిన సీసా ముక్కలు రైతులకు గుచ్చుకొని నానా ఇబ్బందులకు గురవుతున్నారు. సెక్యూరిటీ వున్నా లేనట్టే విధంగా తయారయింది. పంచాయితీల తో,మందుబాబుల వికృత చేష్టలతో ఇబ్బందులకు గురవుతున్నామని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ అధికారులు,పాలక వర్గం పట్టించుకోవాలని కోరుతున్నారు.

## టి బి రహిత సమాజాన్ని నిర్మిద్దాం..

**– ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవ అవగాహన ర్యాలీ..**

**జమ్మికుంట, మార్చి 24( మన వార్త ప్రతినిధి):**ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని




వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వరుణ ఆధ్వర్యంలో మంగళవారం జమ్మికుంట లో ప్రభుత్వ బాలుర పాఠశాల విద్యార్థులతో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవ ర్యాలీని నిర్వహించారు. టి బి అంతం – మన అందరి పంతం. టి బి రహిత సమాజాన్ని –నిర్మిద్దాం. టి బికి –పరీక్షలు ఉచితం. టి బి కి –మందులు ఉచితం వంటి నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం పాఠశాల విద్యార్థులకు డాక్టర్ వరుణ, హెల్త్ ఎడ్యుకేటర్ అడిదెల మోహన్ రెడ్డి టి బి వ్యాధి లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలను క్లుప్తంగా వివరించారు. ఎవరికైనా రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవటం, రాత్రి పూట చెమటలతో జ్వరం రావటం, దగ్గులో తెమడ పడటం, అలసట వంటి మొదలగు లక్షణాలు ఉంటే వెంటనే ఆసుపత్రి కి వచ్చి పరీక్షలు చేహించుకోవాలని సూచించారు. వ్యక్తి గత పరిశుభ్రత పై అవగహన కల్పించినారు. వడ దెబ్బ లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలను క్లుప్తంగా వివరించారు. అనంతరం విద్యార్థులచే మానవహారం నిర్వహించి ,టి బి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమములో డాక్టర్ వరుణ, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యేసు మని, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఏఎన్ఎం రాధ,టిబి క్లస్టర్ కోఆర్డినేటర్ తిరుపతి,ఆశా కార్యకర్త సునీత,పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల అక్రమ అరెస్టులు..

**జమ్మికుంట, మార్చి 24( మన వార్త ప్రతినిధి):**కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఎన్నికల మేనిఫెస్టో చెప్పినట్టు ఇవ్వకుండా అక్రమ అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బి ఆర్ ఎస్ వి జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు కొమ్ము నరేష్ ధ్వజమెత్తారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అసెంబ్లీ ముట్టడి సందర్భంగా ఉద్యమకారులను ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ అధికారంలోకి రావాలని కాంగ్రెస్ ఆరు గ్యారంటీలో ఒకటి ఉద్యమకారులకు కూడా గుర్తింపు కార్డు 250 ఇంటి స్థలం భూమి, రూ 25000 పెన్షన్ ప్రతి ఒక్క ఉద్యమకారులకు ఇస్తానని హామీ ఇస్తనని ఎన్నికల లో చెప్పడం జరిగినదిని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలను ఇంతవరకు అమలు కాలేదు దానికోసం ఉద్యమకారుల ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి ఉండగా పోలీసులు అక్రమ అరెస్టులు చేశారని అన్నారు. ఎన్ని అక్రమ అరెస్టులు చేసినా ఆ రోజున తెలంగాణ రావాలని ఉవ్వెత్తున ప్రతి ఒక్కరూ భరిగిరిసి కొట్లాడడం చావో రేవో తెలంగాణ వచ్చుడు అని ఈరోజు మీరు సీఎంగా ఉన్నారంటే అది ఉద్యమకారుల సహకారం తో వందలాది కేసులు పెట్టిన పువ్వెత్తున ఉద్యమించడం జరిగినది కాబట్టి మీరు ఇచ్చిన హామీలు రెండున్నర సంవత్సరాలు అవుతుంది, ఇంతవరకు నెరవేర్చలే కాబట్టి లేనియెడల మీరు గద్ద దింపే దాకా మరో ఉద్యమం మొదలవుతుందని హెచ్చరించారు.

## పెద్ద శేష వాహనం పైన ఊరేగిన రామచంద్ర మూర్తి...

**-గోవింద నామస్మరణలతో మారి మోగిన స్వర్ణగిరి క్షేత్రం...**

**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి మార్చి 24** భూలోక వైకుంఠంగా విరాజిల్లుతున్న



స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిత మవుతున్న దివ్య మహోత్సవాలలో భాగంగా మంగళవారం రోజు ఐదవ రోజు సాయంత్రం శ్రీ రాముల వారు పెద్దశేష వాహనంపై అత్యంత వైభవంగా మాడ వీధులలో ఊరేగి భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఆది శేషుని మహిమను ప్రతి బింబించే ఈ వాహన సేవలో శ్రీ రామచంద్ర మూర్తి దివ్య అలంకారాలతో విరాజిల్లుతూ , భక్తులను కటాక్షిస్తూ క్షేత్ర వీధులలో విహరించారు. వేదఘోషలు , మంగళ వాద్యాల నాదాలు , గోవింద నామస్మరణల మధ్య ఈ దివ్య విహారం ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత మహోన్నతంగా మార్చింది. అనేక ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు మాడ వీధులను నింపుకొని , అత్యంత భక్తి శ్రద్ధలతో స్వామివారిని దర్శించు కుంటూ హారతులు సమర్పించి తమ భక్తిని వ్యక్తపరిచారు. పెద్దశేష వాహనంపై స్వామివారి దర్శనం భక్తుల హృదయాలలో అపారమైన ఆనందాన్ని నింపింది. శ్రీవారి కృపాకటాక్షాలు సమస్త భక్తజనులపై ప్రసరించి , సర్వలోక మంగళం చేకూరాలని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు చైర్మన్లు మానేపల్లి మురళీకృష్ణ గోపికృష్ణలు హృదయపూర్వకంగా స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు.

# ఇసుక ట్రాక్టర్లు పట్టివేత..

**జమ్మికుంట, మార్చి 24( మన వార్త ప్రతినిధి):**ఎలాంటి ఆధారాలు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రామకృష్ణ తెలిపారు.పోలీస్ సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తుండగా పట్టణంలోని గణేష్ నగర్ వద్ద విలసాగర్ గ్రామానికి చెందిన ఉడాడి కుమార్, దుగ్యాల ఓదెలు ఎలాంటి ఆధారాలు లేకుండా ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా మానేరు వాగు నుండి రవాణా చేస్తూ ఉండగా పట్టుకొని ట్రాక్టర్లను సీజ్ చేసి పై వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

## సహారా బాధితుల డబ్బులు వెంటనే చెల్లించాలి

**-సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్...**

**-సిరిసిల్ల ఆర్డీఓ ఆఫీస్ ముందు సహారా బాధితుల ధర్నా...**

**వేములవాడ మార్చి 24 (మన వార్త )**సహారా ఇండియా గ్రూప్ కంపెనీలో డబ్బులు డిపాజిట్ చేసిన బాధితులందరికీ





ఎలాంటి షరతులు లేకుండా వెంటనే నగదు చెల్లించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయం ముందు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సహారా బాధితులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ ద్వారా ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మూషం రమేష్ మాట్లాడుతూ.. అధిక వడ్డీ వస్తుందని, భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడుతుందని కోట్లాది మంది సామాన్య ప్రజలు సహారా ఇండియాలో పొదుపు చేసుకున్నారని తెలిపారు. 2023 నవంబర్‌లో సంస్థ అధినేత సుబ్రతా రాయ్ మరణం తర్వాత కంపెనీ మూతపడటంతో డిపాజిటర్లకు తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం కంపెనీ ఆస్తులను జప్తు చేసి బాధితులకు ఏడాదిలోపు డబ్బులు చెల్లించాల్సి ఉన్నా, కేంద్ర ప్రభుత్వం అనేక నిబంధనలు, షరతులు పెడుతూ కాలయాపన చేస్తోందని విమర్శించారు.ఎకేవలం పది వేల నుండి యాభై వేల లోపు ఉన్న వారికి మాత్రమే చెల్లింపులు చేస్తూ, మిగతా వారిని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బాధితులు కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయారని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డిపాజిట్ చేసిన వారందరికీ పూర్తి నగదు అందించాలని కోరారు. లేనిపక్షంలో బాధితులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.ఎఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జవ్వాజి విమల, కోడం రమణ, నాయకులు ఆడెపు రజిత, సందుపట్ల పోచమల్లు, గోవర్ధన్, సహారా బాధితులు బొడ్డు వీరేశం, నందం, లక్ష్మీపతి, నరేష్, సదానందం, కవిత, సుజాత, లక్ష్మి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## సురేష్ నాయి కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు



**మొయినాబాద్ మార్చ్ 24:మన వార్త ప్రతినిధి** మొయినాబాద్ నాయి బ్రాహ్మణ సంఘానికి చెందిన సురేష్ ఇటీవల మరణించారు.ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు సురేష్ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు భవిష్యత్తులో కూడా సురేష్ కుటుంబానికి సంఘం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు రాజు నరసింహ అప్పరెడ్డిగూడెం శీను సుధాకర్ కనకమామిడి మంగళ శీను , మేడిపల్లి సాయి తదితరులు పాల్గొన్నారు.

# విలువల విద్యకు ప్రాధాన్యం...



**అమరావతి:** కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా పైపాళ్యం గ్రామంలో నిర్వహించిన విలువల బడి కార్యక్రమంలో నారా భువనేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మమేకమై వారి చదువులు, అభిరుచులపై తెలుసుకుంటూ వారికి ప్రేరణనిచ్చారు. విద్యార్థులను చూసినప్పుడల్లా తన చిన్ననాటి విద్యాభ్యాసం గుర్తుకు వస్తుందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా మోరల్ సైన్స్ వంటి విలువల ఆధారిత పాఠ్యాంశాలను మళ్లీ విద్యా విధానంలో చేర్చాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించడంలో ఇటువంటి పాఠ్యాంశాలు కీలకమని పేర్కొన్నారు.ఇప్పటి కాలంలో సెల్‌ఫోన్లు, ఇంటర్నెట్, టీవీలు, సోషల్ మీడియా వంటి వాటి ప్రభావం ఎక్కువగా ఉందని, విద్యార్థులు వీటికి దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. తమ చిన్నతనంలో ఈ సాంకేతిక వసతులు లేకపోవడం వల్ల కుటుంబంతో కలిసి సంతోషంగా గడిపిన రోజులను గుర్తుచేసుకున్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో అవసరమని, జీవితం లో విజయం సాధించాలంటే నియమాలను పాటించాల్సిన అవసరం ఉందని వివరించారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో ఉండే ఆనందం, పరస్పర సహకారం గురించి కూడా వారికి అవగాహన కల్పించారు. మొత్తంగా విలువలతో కూడిన విద్యే మంచి సమాజ నిర్మాణానికి పునాది అని భువనేశ్వరి స్పష్టం చేశారు. విద్యార్థులు చదువుతో పాటు మంచి విలువలను అలవాటు చేసుకుంటే భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదుగుతారని తెలిపారు.

# లబ్ధిదారుల నిరీక్షణకు ముగింపు




**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం నుంచి కొత్త ఇళ్ల కోసం ఎదురు చూస్తున్న పేదల నిరీక్షణకు త్వరలో ముగింపు కానుంది. వచ్చే నెలలో కొత్త ఇళ్ల మంజూరు ప్రక్రియను ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. పీఎం ఆవాస్ యోజన పథకంతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్లు నిర్మించేందుకు ఆర్థిక సహాయం అందిస్తోంది. పీఎం ఆవాస్ యోజన 2.0 కింద గ్రామీణ ప్రాంతాల నుంచి గత ఏడాది డిసెంబర్ వరకు దరఖాస్తులు స్వీకరించగా, ఇప్పటివరకు సుమారు 10 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో పరిశీలన అనంతరం 6.50 లక్షల మంది అర్హులుగా గుర్తించారు. ఈ జాబితాను కేంద్రానికి పంపించగా, అక్కడ కూడా క్షేత్రస్థాయిలో పరిశీలన కొనసాగుతోంది. కేంద్రం ఆమోదం వచ్చిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తుది లబ్ధిదారుల జాబితాను విడుదల చేయనుంది. ఇల్లు నిర్మించుకునే ప్రతి లబ్ధిదారుడికి రూ.2.39 లక్షల ఆర్థిక సాయం అందించనున్నారు. వచ్చే నెలలోనే జాబితాకు గ్రీన్ సిగ్నల్ వచ్చే అవకాశముందని గృహనిర్మాణ శాఖ మంత్రి పార్థసారధి తెలిపారు. సీఎం చంద్రబాబు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ అంశంపై చర్చించి, కీలక నిర్ణయాలు తీసుకున్నారు.అదేవిధంగా రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ కొరత, సరఫరా పరిస్థితిపై కూడా సీఎం సమీక్ష నిర్వహించారు. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధ ప్రభావంతో గ్యాస్ కొరత ఏర్పడిందని పేర్కొంటూ, ప్రత్యామ్నాయ మార్గాలైన పైప్డ్ నేచురల్ గ్యాస్, ఇండక్షన్ స్టవ్స్ వినియోగంపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ప్రతి ఇంటికి పీఎన్‌జీ అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇక అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను గుర్తించి, రైతు సేవా కేంద్రాల్లో జాబితాలను ప్రదర్శించాలని సీఎం సూచించారు. ఈ నెల 31 నాటికి పూర్తి వివరాలను సమర్పించాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

# టీడీపీ జనసేన మధ్య అసంతృప్తి...



**అమరావతి:** రాష్ట్ర రాజకీయాల్లో టీడీపీ జనసేన కూటమి మధ్య స్వల్ప అసంతృప్తి వెలుగులోకి వచ్చింది. జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ, టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్న ప్రాంతాల్లో జనసేనకు సరైన ప్రాధాన్యం దక్కడం లేదని వ్యాఖ్యానించారు. కూటమిలో భాగస్వామ్యంగా ఉన్నప్పటికీ సమాన గౌరవం లభించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ, ఇతర పరిపాలనా అంశాల్లో జనసేనకు అన్యాయం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఈ విషయాలను ఇప్పటికే పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం నడుస్తున్న నేపథ్యంలో భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం మరింత బలపడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.జనసేన ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో తాము టీడీపీకి ప్రాధాన్యం ఇస్తున్నామని, అదే విధంగా టీడీపీ కూడా తమకు సమాన గౌరవం ఇవ్వాలని కోరారు. కూటమి విజయానికి పరస్పర సహకారం కీలకమని, ఒకరినొకరు గౌరవించడం అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కూటమి లోపల ఉన్న అసంతృప్తిని తగ్గించేందుకు నాయకత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తంగా కూటమి బలోపేతానికి సమన్వయం కీలకంగా మారిందని చెప్పవచ్చు.

# ప్రతి శుక్రవారం మనది కాదు..




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మాస్ కం బ్యాక్ మూవీగా భారీ అంచనాల మధ్య విడుదలైన చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. అయితే బాక్సాఫీస్ వద్ద మిశ్రమ ఫలితాలను ఎదుర్కొంటోంది.హరీష్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం ఓపెనింగ్స్ పరంగా ఫర్వాలేదనిపించినా, వీక్ డేస్‌లో మాత్రం వసూళ్లు ఆశించిన స్థాయిలో లేవు. ముఖ్యంగా బాక్సాఫీస్ వద్ద రికార్డులను తిరగరాస్తున్న రణవీర్ సింగ్ 'ధురంధర్ 2' సునామీ ముందు ఉస్తాద్ నిలదొక్కుకోవడం సవాలుగా మారింది.ఈ నేపథ్యంలో దర్శకుడు హరీష్ శంకర్ సినిమాను ప్రమోట్ చేసేందుకు సరికొత్త వ్యూహాలతో ముందుకెళుతున్నారు. తాజాగా ఆయన హీరోయిన్ శ్రీలీలతో కలిసి మహిళా ప్రేక్షకులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక ముఖాముఖిలో పాల్గొని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.'ఉస్తాద్'పైనే ప్రేమ ఎక్కువ!మహిళా ప్రేక్షకులతో జరిగిన చిట్ చాట్ సెషన్‌లో ఒక అభిమాని అడిగిన ప్రశ్నకు హరీష్ శంకర్ స్పందిస్తూ.. నాకు 'గబ్బర్ సింగ్' అంటే ఎంత ఇష్టమో.. 'ఉస్తాద్ భగత్ సింగ్' అంటే అంతకంటే ఎక్కువ ప్రేమ. ఎందుకంటే గబ్బర్ సింగ్ తీసినప్పటి కంటే ఇప్పుడు నాలో ఒక పరిణతి చెందిన రచయిత కనిపిస్తున్నాడు. ప్రతి దర్శకుడు తన సినిమా సోలోగా విడుదల కావాలని కోరుకుంటాడు. కానీ ఎగ్జిబిటర్లు, నిర్మాతల నిర్ణయం మేరకు మేం సినిమాను ముందుగానే విడుదల చేయాల్సి వచ్చింది అని తెలిపారు.'ధురంధర్ 2' తో పోటీ..నిజానికి బాక్సాఫీస్ వద్ద 'ధురంధర్ 2' లాంటి భారీ సినిమాతో పోటీ పడటం ఒక పెద్ద రిస్క్ అని హరీష్ శంకర్ అన్నారు. అది ఒక 'మోన్‌స్టర్' (వీశీఅర్‌వతీ) లా బాక్సాఫీస్ వద్ద విరుచుకుపడుతోంది. అయినప్పటికీ మా సినిమాపై మాకు నమ్మకం ఉంది అని పేర్కొన్నారు. భగవద్గీతలోని శ్లోకాన్ని ఉదాహరిస్తూ.. మన చేతుల్లో కేవలం ప్రయత్నం మాత్రమే ఉంటుంది, ఫలితం దైవాధీనం. సినిమాకు వస్తున్న ప్రశంసలు చూసి సంతోషిస్తున్నాను అని ఎమోషనల్ అయ్యారు.వసూళ్ల తగ్గుదలపై హరీష్ శంకర్ చాలా ప్రాక్టికల్‌గా స్పందించారు. ప్రతి సినిమా రికార్డులు బద్దలు కొట్టాలని లేదు, ప్రతి శుక్రవారం మనదే కావాలని లేదు. మన చేతుల్లో కేవలం కంటెంట్ మాత్రమే ఉంటుంది. కానీ వసూళ్లు అనేవి రిలీజ్ విండో, టికెట్ ధరలు, పోటీలో ఉన్న ఇతర సినిమాలపై ఆధారపడి ఉంటాయి. ఉస్తాద్ గత రికార్డులను బ్రేక్ చేయకపోయి ఉండొచ్చు, కానీ సినిమా అందించే సందేశం ప్రేక్షకులకు చేరుతుందనే నమ్మకం ఉంది అని వివరించారు. ప్రస్తుతం 'ఉస్తాద్ భగత్ సింగ్' థియేటర్లలో తన పోరాటాన్ని కొనసాగిస్తోంది. ఇప్పటి వరకు సుమారు రూ. 85 కోట్లు వసూళ్లు సాధించినట్లు తెలుస్తోంది. మరి రాబోయే రోజుల్లో ఈ సినిమా ఏ మేరకు కలెక్షన్లు అందుకుంటుందో చూడాలి.

# ఏడాది తర్వాత ఓటీటీలోకి ఆది పినిశెట్టి శబ్దం




తెలుగు, తమిళంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న యాక్టర్ ఆది పినిశెట్టి.ఈ టాలెంటెడ్ యాక్టర్ హీరోగా నటించిన చిత్రం శబ్దం.వైశాలి ఫేం అరివజగన్ వెంకటాచలం దర్శకత్వం వహించిన ఈ మూవీ హార్రర్, ఎమోషనల్ ఎలిమెంట్స్‌తో సాగే రివేంజ్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కింది. 2025 ఫిబ్రవరి 28న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రానికి మిక్స్‌డ్ రెస్పాన్స్ వచ్చింది.కాగా శబ్దం లాంగ్ గ్యాప్ తర్వాత ఓటీటీలో తన లక్ పరీక్షించుకునే రెడీ అయింది. ప్రస్తుతం పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం జీ5లో స్ట్రీమింగ్ అవుతోంది. కేవలం తమిళంలో స్ట్రీమింగ్ అవుతుండగా.. తెలుగు వెర్షన్‌కు సంబంధించి మేకర్స్ నుంచి ఎలాంటి అప్‌డేట్ అం సుమారు ఏడాది తర్వాత డిజిటల్ ఇవ్వబోతున్న ఈ చిత్రం ఎలాంటి స్పందన రాబట్టుకుంటుందనేది చూడాలి.ఈ చిత్రంలో అలనాటి అందాల తార లైలా కీలక పాత్రలో నటించగాడ సిమ్రన్, లక్ష్మీ మీనన్, రెడిన్ కింగ్ స్లే ఇతర కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి ఎస్ థమన్ మ్యూజిక్ అందించాడు. ఈ సినిమాను 7జీ ఫిలిమ్స్, అల్ఫా ఫ్రేమ్స్ బ్యానర్లపై సంయుక్తంగా నిర్మించారు.

# ఆ మూడు జట్లదే హవా..!




ప్రపంచంలోనే అత్యంత సంపన్నమైన లీగ్‌గా ఐపీఎల్ తన ఆధిపత్యాన్ని చాటుకుంటోంది. తాజాగా విడుదలైన 2025-26 నివేదికల ప్రకారం, ఐపీఎల్ ఫ్రాంచైజీలు కేవలం స్పాన్సర్‌షిప్ డీల్స్ ద్వారానే వెయ్యి కోట్ల రూపాయల మార్కును అధిగమించాయి.ఈ స్థాయిలో ఆదాయం ఆర్జించడం ఇతర దేశాల లీగ్‌లకు, ముఖ్యంగా పాకిస్థాన్ సూపర్ లీగ్ (**PSL**) వంటి వాటికి అందనంత ఎత్తులో ఉంది. కేవలం టికెట్ల అమ్మకాలపైనే ఆధారపడకుండా, కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యంతో జట్లు భారీగా లాభాలను గడిస్తున్నాయి. స్పాన్సర్‌షిప్ సమీకరణాల్లో మార్పులు..ఒకప్పుడు ఫాంటసీ గేమింగ్ కంపెనీలు ఐపీఎల్ జట్లపై భారీగా పెట్టుబడులు పెట్టేవి. అయితే, భారత క్రికెట్ నియంత్రణ మండలి (**BCCI**) నిబంధనల్లో తీసుకొచ్చిన మార్పుల వల్ల కొన్ని గేమింగ్ కంపెనీల ప్రాబల్యం తగ్గింది. అయినప్పటికీ, ఇతర రంగాలకు చెందిన దిగ్గజ సంస్థలు క్రికెట్ క్రేజ్‌ను వాడుకోవడానికి క్యూ కడుతున్నాయి. దీనివల్ల జట్ల ఆదాయ వనరులు మరింత విస్తృతమయ్యాయి.టాప్ గేర్‌లో ముంబై, బెంగళూరు, చెన్నై.. ఐపీఎల్ ఆదాయంలో అన్ని జట్లు సమానంగా లేవు. జనాదరణ, బ్రాండ్ విలువ ఆధారంగా మూడు జట్లు అగ్రస్థానంలో కొనసాగుతున్నాయి:ముంబై ఇండియన్స్..రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు..చెన్నై సూపర్ కింగ్స్..ఈ మూడు జట్ల స్పాన్సర్‌షిప్ విలువ ఒక్కొక్కటి సుమారు రూ. 150 కోట్ల వరకు ఉంది. వీటి తర్వాత కోల్‌కతా నైట్ రైడర్స్ (**KKR**), గుజరాత్ టైటాన్స్ రెండో స్థానంలో నిలిచాయి. మిగిలిన జట్లు ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.ఆర్‌సీబీ బ్రాండ్ వాల్యూకు విరాట్ కోహ్లీ తోడు..రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధిక ఫాలోయింగ్ కలిగిన ఫ్రాంచైజీగా ఆర్‌సీబీ రికార్డు సృష్టించింది. దీనికి ప్రధాన కారణం స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ. కోహ్లీకి ఉన్న అంతర్జాతీయ స్థాయి ఫ్యాన్ ఫాలోయింగ్ ఆ జట్టుకు వరంగా మారింది. దీనికి తోడు, 18 ఏళ్ల నిరీక్షణ తర్వాత 2025లో ఆర్‌సీబీ తొలిసారి ఐపీఎల్ టైటిల్‌ను గెలవడం ఆ జట్టు బ్రాండ్ వాల్యూను ఆకాశానికి చేర్చింది. ఛాంపియన్ హోదాలో 2026 బరిలోకి దిగుతుండటంతో స్పాన్సర్లు ఈ జట్టుపై కోట్లు కుమ్మరిస్తున్నారు.

# సౌతాఫ్రికా టూర్ కోసం భారత మహిళల జట్టు ప్రకటన..




ఐపీఎల్ 2026 సందడి దేశవ్యాప్తంగా మొదలవుతున్న వేళ, బీసీసీఐ ఒక కీలక ప్రకటన చేసింది. పురుషుల ఐపీఎల్ ఫీవర్ ఒకవైపు కొనసాగుతుండగానే, మరోవైపు భారత మహిళల క్రికెట్ జట్టు సౌతాఫ్రికా పర్యటనకు సిద్ధమైంది.ఏప్రిల్ 2026లో జరగనున్న ఈ 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం 15 మంది సభ్యులతో కూడిన పటిష్టమైన టీమిండియాను బీసీసీఐ ప్రకటించింది. ఈ జట్టుకు ఎప్పటిలాగే స్టార్ ప్లేయర్ హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యం వహించనున్నారు. ఈ పర్యటనలో అత్యంత ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. భారత టీ20 జట్టులోకి ఇద్దరు యువ క్రీడాకారిణులు తొలిసారిగా ఎంపికయ్యారు. వారు కశ్వి గౌతమ్, అనుష్క శర్మ. వీరిద్దరూ డొమెస్టిక్ క్రికెట్‌లో అద్భుతమైన ప్రతిభను కనబరచడం వల్ల సెలెక్టర్లు వారిని జాతీయ జట్టుకు ఎంపిక చేశారు. ఈ కొత్త రక్తంతో జట్టు మరింత ఉత్సాహంగా కనిపిస్తోంది. వీరితో పాటు సీనియర్ ఆటగాళ్లు స్మృతి మంధాన, షెఫాలీ వర్మ తమ మెరుపులతో సౌత్ ఆఫ్రికా బౌలర్లను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నారు.సౌతాఫ్రికా పర్యటనకు భారత జట్టు (15 మంది సభ్యులు):బీసీసీఐ ఎంపిక చేసిన ఈ 15 మంది సభ్యుల జట్టులో అనుభవం, యువత కలయిక కనిపిస్తోంది.హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన, షెఫాలీ వర్మ, జెమిమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా ఘోష్, అరుంధతి రెడ్డి, రేణుక ఠాకూర్, క్రాంతి గౌడ్, శ్రీ చరణి, శ్రేయాంక పాటిల్, కశ్వి గౌతమ్, భారతి ఫుల్మాలి, ఉమా ఛెత్రి, అనుష్క శర్మ.సౌతాఫ్రికా పర్యటన పూర్తి షెడ్యూల్ మొత్తం 5 టీ20ల సిరీస్ ఏప్రిల్ 17 నుంచి ప్రారంభం కానుంది.భారత మహిళల జట్టు ప్రస్తుతం ఉన్న ఫామ్ చూస్తుంటే సౌతాఫ్రికా గడ్డపై సిరీస్ గెలవడం పెద్ద కష్టమేమీ కాదని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా డర్బన్, జోహన్నెస్‌బర్గ్ వంటి వేగవంతమైన పిచ్‌లపై మన బౌలర్లు రేణుక ఠాకూర్, శ్రేయాంక పాటిల్ ఎలా రాణిస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఐపీఎల్ సీజన్ మధ్యలో ఈ సిరీస్ రావడం వల్ల క్రికెట్ ప్రేమికులకు పగలు ఐపీఎల్, సాయంత్రం భారత్ అంతర్జాతీయ మ్యాచ్‌లతో ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ లభించనుంది.

Edited, Published & Owned by **BHUPATHI SANTHOSH.** Printed at PARAHUSHAR PRINTING PUBLICATIONS, H. NO. 1-6-27/2,SRI NAGAR COLONY, MAHABUBABAD, WARANGAL, TELANGANA-506101.Published at Jammikunta, karimnagar,Telangana-505122. EDITOR: BHUPATHI SANTHOSH. Cell: 9247819181 | **RNI No: TGTEL/25/A1882,**Email:Mana vaartha tg. Daily@gmail.com